www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -53 ఆదివారం 7 జూన్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

## కాక్రోచ్ ల ఆందోళన




### కేంద్రాన్ని నిలదీసిన సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే

అంబేద్కర్ (భగత్ సింగ్ సావిత్రిబాయి పూలే ఫొటోలతో నినాదాల హోరు

ఒక చేతిలో రాజ్యాంగం, మరో చేతిలో జాతీయ జెండా

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేవరకూ నిరసనలు కొనసాగుతాయని వెల్లడి

జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళన

**న్యూఢిలీజూన్ 6 (ప్రజావినికిడి):** నీట్ తదితర ప్రవేశ పరీక్షలు, రిక్రూట్మెంట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న కష్టనష్టాలను పరిష్కరించేందుకు ప్రస్తుత విద్యా**మిగతా 2లో...**



కోహెడ పండ్ల మార్కెట్‌కు శంకుస్థాపనలో సీఎం రేవంత్ రెడ్డి

## ధాన్యం కొనకుంటే మోడీ సంగతి తేలుస్తాం

అష్టదరిద్రులు అడ్డంపడ్డా అభివృద్ధి ఆగదు

ఎవరెంత ఏడ్చినా.. ఆర్ఆర్ఆర్ నిర్మిస్తాం

వ్యవసాయాన్ని పండగ చేయడమే మా లక్ష్యం

వరి వేస్తే ఉరి అనే రోజులు పోయాయి

కాళేశ్వరం లేకున్నా లక్ష టన్నుల ధాన్యం పండింది

ఇంతకాలం ఎక్కడ నీళ్లున్నా కాళేశ్వరం అంటూ ప్రచారం

అభివృద్ధి నిరోధకంగా బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు

**రంగారెడ్డి,జూన్ 6 (ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లాలోని కోహెడలో నిర్మించనున్న సమీకృత పండ్ల మార్కెట్ మనకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు తీసుకొస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. స్థానికంగా పండ్ల మార్కెట్‌తో పాటు ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కాంప్లెక్స్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించారు. నగరంలోని పండ్ల మార్కెట్‌ను కోహెడకు తరలించినప్పుడు తాత్కాలిక టెంట్లు వేశారు.**మిగతా 2లో...**





## ఏపీలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు..

దక్షిణ కోస్తా, రాయలసీమకు అలర్ట్

జూన్ 4న కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు

ఏపీలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

**అమరావతి,జూజూన్ 6 (ప్రజావినికిడి):** ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వాతావరణ శాఖ తీపి కబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఏపీలోకి ప్రవేశించాయి. వాతావరణ శాఖ అధికారుల సమాచారం ప్రకారం...**మిగతా 2లో...**

## ముందస్తు చర్యలకు సిద్ధం కండి

వర్షాకాలం వస్తోంది జాగ్రత్త

ధాన్యం కొనుగోళ్లు, సిఎం పర్యటనలపై జాగ్రత్తలు

కలెక్టర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిఎస్ ఆదేశాలు

**హైదరాబాద్,జూన్ 6 (ప్రజావినికిడి):** తెలంగాణలో వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాని, ముందస్తు చర్యలకు దిగాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాల పరిస్థితులు, వరి కొనుగోళు,, ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనల ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. శనివారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. ఈ సమావేశంలో ఈ సమావేశంలో వర్షాల ప్రభావంపై ప్రత్యేకంగా చర్చించిన సీఎస్, అన్ని జిల్లాల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.**మిగతా 2లో...**



## తెలుగుదేశం పార్టీ రాజ్యసభ అభ్యర్థుల ప్రకటన

ముగ్గురి పేర్లను ఖరారు చేసిన టీడీపీ నాయకత్వం

సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్‌లకు అవకాశం

అభ్యర్థులను అధికారికంగా ప్రకటించిన చంద్రబాబు



**అమరావతిజూన్ 6(ప్రజావినికిడి):** తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తమ రాజ్యసభ అభ్యర్థులను ఖరారు చేసింది. ముగ్గురు అభ్యర్థులతో కూడిన జాబితాను పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు శనివారం అధికారికంగా విడుదల చేశారు. జూన్ 18న జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ తరఫున సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ బరిలో నిలవనున్నారు.**మిగతా 2లో...**



## ఆర్థికాభివృద్ధిని బలోపేతం చేద్దాం

సామాన్య ప్రజల జీవన , వ్యాపార నిర్వహణ సౌలభ్యాలే లక్ష్యంగా సంస్కరణలు ఉండాలి :(ఆర్థిక సలహా మండలి(ఈఏసీ) సభ్యులతో ప్రధాని మోడీ భేటీ

## ఏపీ యువత భవిష్యత్తే లక్ష్యం

### రష్యాలో మంత్రి నారా లోకేష్ కీలక భేటీలు

సంక్షోభంలోనూ అవకాశాలు సృష్టించడమే నాయకత్వమన్న లోకేష్

ప్రవాస భారతీయులు ఏపీ బ్రాండ్ అంబాసిడర్లుగా మారి అభివృద్ధిలో భాగం కావాలని పిలుపు

అమరావతి, విశాఖలో స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కోసం యాండెక్స్ సంస్థతో కీలక చర్చలు

టీచర్లు లేని వినూత్న 'స్కూల్ 21'ను సందర్శించి, విద్యా విధానాలపై అధ్యయనం




## ఏపీ సీఎం చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కయ్యారు

సాగునీటి ప్రాజెక్టులపై తమను విమర్శించే హక్కు రేవంత్ కు లేదన్న హరీశ్

కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరుకు చేసిందేమీ లేదని వ్యాఖ్య

ఈ ఏడాది 75 శాతం కృష్ణా నీటిని ఏపీ వాడుకుందని ఆరోపణ

**జూన్ 6 (ప్రజావినికిడి):** పాలమూరు ప్రాజెక్టు సందర్శనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన విమర్శలకు బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు గట్టి కౌంటర్ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డివి "మతిలేని మాటలు" అంటూ ఆయన తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు.నేడు ఓ న్యూస్ ఛానల్‌తో మాట్లాడిన హరీశ్ రావు...బీఆర్ఎస్ చేపట్టబోయే పాదయాత్ర భయంతోనే సీఎం రేవంత్ రెడ్డికి **మిగతా 2లో...**



## తెలుగుదేశం పార్టీ రాజ్యసభ అభ్యర్థుల ప్రకటన

**మొదటిపేజీ తరువాయి**

వివరాల్లోకి వెళ్తే, రాజ్యసభ అభ్యర్థులుగా పారిశ్రామికవేత్త సానా సతీష్, ప్రముఖ విద్యావేత్త, భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ, పార్టీ సోషల్ మీడియా విభాగం ముఖ్య నేతగా ఉన్న చింతకాయల విజయ్‌లను ఎంపిక చేసినట్లు పార్టీ ప్రకటించింది. రానున్న ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై కొంతకాలంగా పార్టీ వర్గాల్లో చర్చలు జరగ్గా, చివరికి అధిష్టానం ఈ ముగ్గురి పేర్లను ఖరారు చేసింది. ఈ ముగ్గురిని చంద్రబాబు ఇవాళ తన క్యాంపు కార్యాలయానికి పిలిపించి స్వయంగా బి-ఫారాలు అందజేశారు. వారు సోమవారం నాడు నామినేషన్లు దాఖలు చేయనున్నారు.

ఈ మేరకు మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయం నుంచి అధికారికంగా పత్రికా ప్రకటన వెలువడింది. కాగా, ఏపీలో నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవడం తెలిసిందే. కూటమి పొత్తు ధర్మం ప్రకారం నాలుగు స్థానాల్లో ఒకటి జనసేనకు కేటాయించగా, తమ అభ్యర్థిగా జనసేన పార్టీ లింగమనేని రమేష్ పేరును ఖరారు చేయడం తెలిసిందే.

## ఏపీలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు..

**మొదటిపేజీ తరువాయి**

జూన్ 4న కేరళను తాకిన రుతుపవనాలు, అక్కడి నుంచి అత్యంత వేగంగా ముందుకు కదిలి ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లోకి అడుగుపెట్టాయి. రాబోయే కొన్ని రోజుల్లో ఇవి దక్షిణ కోస్తా జిల్లాలతో పాటు రాయలసీమ ప్రాంతమంతటా విస్తరించేందుకు వాతావరణ పరిస్థితులు పూర్తిగా అనుకూలంగా ఉన్నాయని అధికారులు వెల్లడించారు.

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గత రెండు, మూడు రోజులుగా ఇప్పటికే తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. అయితే రుతుపవనాల రాకతో రాబోయే వారంలో ఏపీవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. గత కొన్ని రోజులుగా జనాలను హడలెత్తించిన భానుడి భగభగలు తగ్గి, ఉష్ణోగ్రతలు ఈ వర్షాలతో అదుపులోకి రానున్నాయి.

మరోవైపు రుతుపవనాల ప్రవేశంతో రైతన్నల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడితే, ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సాగు పనులు.. ముఖ్యంగా వరి నారుమళ్లు, నాట్లు వేసే ప్రక్రియ ఎలాంటి ఆటంకం లేకుండా సజావుగా సాగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఏపీ యువత భవిష్యత్తే లక్ష్యం

**మాస్కో,జూన్ 6 (ప్రజావినికిడి):** ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ రష్యాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన.. ప్రముఖ టెక్ సంస్థ యాండెక్స్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో అమరావతి, విశాఖపట్నంలో స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థల అమలుపై కీలక చర్చలు జరిగాయి.

ప్రిడిక్టివ్ ట్రాన్సిట్ షెడ్యూలింగ్, పబ్లిక్ సేఫ్టీ అనలిటిక్స్, ఎఐ ఆధారిత ట్రాఫిక్ మానిటరింగ్ సిస్టమ్స్‌ను రెండు నగరాల్లో ప్రవేశపెట్టే అవకాశాలను పరిశీలించినట్లు సమాచారం. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఆధునిక టెక్నాలజీ వినియోగంపై ప్రత్యేకంగా చర్చలు జరిగాయి. లాస్ట్ మైల్ రవాణా ఖర్చులను తగ్గించే మార్గాలపై కూడా లోకేష్ సూచనలు చేశారు. అలాగే క్విక్ కామర్స్, డెలివరీ ఫ్లీట్లలో ఆటోనమస్ వెహికల్స్ వినియోగంపై యాండెక్స్ బృందంతో చర్చించారు. విశాఖలో ఏర్పాటు చేయనున్న ఎఐ డేటా సెంటర్‌కు సాంకేతిక భాగస్వామ్యం, అలాగే హై-పెర్ఫార్మెన్స్ క్లౌడ్ ఫ్రేమ్‌వర్క్‌ల వినియోగంపై కూడా సమావేశంలో చర్చలు జరిగినట్లు తెలిసింది. స్థానిక పరిపాలనలో ఎఐ మోడల్స్ వినియోగంపై సమావేశంలో చర్చలు జరిపారు. రష్యాలోని స్బేర్ సిటీలో యాండెక్స్ ఉన్నతస్థాయి బృందంతో కూడా మంత్రి లోకేష్ భేటీ అయ్యారు. ఐదవ రోజు పలు కీలక సంస్థలతో ఆయన వరుస సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

## ఏపీ సీఎం చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కయ్యారు


**మొదటిపేజీ తరువాయి**

నిద్ర కరువైందని, సాగునీటి ప్రాజెక్టులపై తమను విమర్శించే నైతిక హక్కు ఆయనకు లేదని స్పష్టం చేశారు. "అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరుకు చేసిందేమీ లేదు. సీఎం రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుతో కుమ్మక్కై తెలంగాణకు తీవ్ర ద్రోహం చేస్తున్నారు. అందుకే ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ 75 శాతం కృష్ణా నీటిని వాడుకుంటే, తెలంగాణ కేవలం 25 శాతానికే పరిమితమైంది" అని హరీశ్ రావు ఆరోపించారు. ఈ వైఫల్యానికి గానూ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో పాలమూరు పరిధిలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని గుర్తుచేశారు. పాలమూరు రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా మోసం చేసిందని, రాబోయే రోజుల్లో కొడంగల్‌లో రేవంత్ రెడ్డిని మళ్లీ ఓడించి, పాలమూరు గడ్డపై గులాబీ జెండా ఎగరేస్తామని హరీశ్ రావు ధీమా వ్యక్తం చేశారు.

# ఆర్థికాభివృద్ధిని బలోపేతం చేద్దాం

**సామాన్య ప్రజల జీవన , వ్యాపార నిర్వహణ సౌలభ్యాలే లక్ష్యంగా సంస్కరణలు ఉండాలి :(ఆర్థిక సలహా మండలి(ఈఏసీ) సభ్యులతో ప్రధాని మోడీ భేటీ**

**న్యూఢిల్లీ జూన్ 6 (ప్రజావినికిడి):**



ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితులు నెలకొన్న వేళ భారత ప్రధాని నరేంద్ర మోడీ శనివారం ఆర్థిక సలహా మండలి(ఈఏసీ) సభ్యులతో సమావేశమయ్యారు. మన దేశ ఆర్థిక వృద్ధిని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన వ్యూహాలు, చర్యలు గురించి చర్చించారు. సామాన్య ప్రజల జీవన సౌలభ్యం, వ్యాపార నిర్వహణ సౌలభ్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా చేపట్టాల్సిన సంస్కరణలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు భారత్పై, అలాగే ప్రపంచంపై చూపే ప్రభావంపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశం జరిగిన మరుసటి రోజే ఈ సమావేశం జరగడం గమనార్హం. కాగా శుక్రవారం ఆర్బీఐ గవర్నర్ కీలక ప్రకటనలు చేశారు. ప్రస్తుతం భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణంపై ఆందోళనలు, సప్లై చెయిన్ అంతరాయాలు ఉన్నప్పటికీ, రెపోరేటును 2.52 శాతం వద్ద యథాతథంగా ఉంచుతున్నట్లు ప్రకటించారు. ఈ విషయంలో తాము తటస్థ వైఖరిని అవలంబిస్తున్నామని స్పష్టం చేశారు. ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ, స్థూల ఆర్థిక పరిస్థితులను సమీక్షించిన తర్వాత, లిక్విడిటీ అడ్జస్ట్మెంట్ ఫెసిలిటీ కింద రెపో రేటును మార్చకుండా 5.25 శాతం వద్దే ఉంచాలని ఎంపీసీ నిర్ణయించిందని చెప్పారు. దీని ప్రకారం, స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ 5 శాతం వద్ద, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ, బ్యాంక్ రేటు 5.5 వద్ద కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన అనిశ్చితితో ఉందని, కీలకమైన వాణిజ్య మార్గాలు, సప్లై చెయిన్లకు అవాంతరాలు ఏర్పడుతున్నాయని అన్నారు. వీటికి తోడు మార్కెట్ ఒడుదొడుకులు లాంటి సవాళ్లు ఎదుర్కొంటున్నామని ఆయన పేర్కొన్నారు. అయితే గతంలో వచ్చిన ఇలాంటి పరిస్థితులతో పోల్చితే, నేడు భారత్ మరింత పటిష్టంగా ఉందని, సంక్షోభాలను సమర్థవంతంగా ఎదుర్కొంటోందని అన్నారు. అయితే ప్రస్తుతం ఎదురవుతున్న అవాంతరాలను మనదేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి వచ్చిన ఒక అవకాశంగా పాలసీదారులు ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. పశ్చిమాసియా సంక్షోభం తీవ్రమవుతున్న నేపథ్యంలో, గత నెలలో ప్రధాని మోడీ భారత పౌరులకు 7 విజ్ఞప్తులు చేశారు. ప్రధానంగా దిగుమతి చేసుకునే ఇంధనంపై ఆధారపడడం తగ్గించాలని, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ఉపయోగించి, దేశ ఆర్థిక రక్షణకు సహకరించాలని ప్రజలను కోరారు. వీటితోపాటు ఇంటి నుంచి పనిచేయడం (వర్క్ ఫ్రమ్ హోమ్)కు ప్రాధాన్యత ఇవ్వాలని, ఇంధన వినియోగాన్ని తగ్గించాలని అన్నారు. కనీసం ఒక ఏడాదిపాటు విదేశీ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించారు. స్వదేశీ ఉత్పత్తులను మాత్రమే వాడాలని, వంట నూనెల వినియోగాన్ని తగ్గించాలని అన్నారు. ప్రకృతి వ్యవసాయం (నేచురల్ ఫార్మింగ్) వైపు మళ్లాలని, బంగారం కొనుగోళ్లను నియంత్రించాలని పేర్కొన్నారు. అంతేకాదు ముడి చమురు ధరల్లో వచ్చే ఒడుదొడుకులను తట్టుకోవడానికి, భారతదేశ రవాణా విధానంలో మార్పు రావాలని ప్రధాని మోడీ కోరారు. మెట్రో, ప్రభుత్వ రవాణా సౌకర్యాలను ఉపయోగించాలని, పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ప్రయివేటు వాహనాలు తప్పనిసరి అయినప్పుడు 'కార్ పూలింగ్' పద్ధతిని ఎంచుకోవాలని, వీలైనంత వరకు ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగాన్ని పెంచాలని సూచించారు. వస్తువుల రవాణా కోసం రైల్వే మార్గాలను వాడుకోవాలని అన్నారు.

# కాక్రోచ్ ల ఆందోళన



**మొదటిపేజీ తరువాయి**

వ్యవస్థను సంస్కరించాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసింది. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ శనివారంనాడు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించింది. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈ నిరసనలకు నాయకత్వం వహించగా, ప్రముఖ విద్యావేత్త, యాక్టివిస్ట్ సోనమ్ వాంగ్‌చుక్, పార్టీ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇది సుదీర్ఘ పోరాటమని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ ఆరంభం మాత్రమేనని సీజేపీ స్పష్టం చేసింది. సీజేపీ మద్దతుదారులను ఉద్దేశించి అభిజీత్ దీప్కే మాట్లాడుతూ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంత వరకూ నిరసనలు కొనసాగుతాయని ప్రకటించారు. ఇంకెంతమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునేంత వరకూ అధికారులు వేచిచూస్తారని నిలదీశారు. తమ డిమాండ్ల నెరవేరేంత వరకూ ఈ ఉద్యమం కొనసాగుతుందన్నారు. నిరసనలకు దిగితే జైలులో పెడతారేమోనని తన తల్లి భయపడినట్టు దీప్కే చెప్పారు. 'తమ పిల్లలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పితే ఏమవుతుందోనన్న భయం ఈ దేశంలోని ప్రతి తల్లికి ఉంది. ఈ ప్రభుత్వానికి భయపడి ఎంతకాలం బతకాలని ఆయన ప్రశ్నించారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని నెలరోజుల నుంచి డిమాండ్ చేస్తున్నప్పటికీ చర్చలు తీసుకోవడం లేదని, దీనికి బదులు ఇతర అంశాలపైనే వాళ్లు దృష్టి పెట్టారని అన్నారు. సీజేపీ అకౌంట్లు హ్యాక్ చేయడం, పోస్టులు డిలీట్ చేయడం చేస్తున్నారని చెప్పారు. పోస్టులను డిలీట్ చేయవచ్చు కానీ, తమను ఏమార్చలేరని అన్నారు. పేపర్ లీక్‌లు, విద్యావ్యవస్థలో తప్పిదాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల పేర్లను ఆయన చదవి వినిపించారు. విద్యార్థుల మృతికి సీజేపీ సంతాపం ప్రకటించింది. జంతర్‌మంతర్ నిరసనల్లో పాల్గొనేందుకు ఆయన అమెరికాలోని బోస్టన్ నుంచి ఢిల్లీకి వచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రను చేత్తో పట్టుకుని కనిపించారు. జంతర్ మంతర్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ విద్యాశాఖ మంత్రిగా ఆయన ఉండాలని



కోరారు. అయితే తనకు రాజకీయాల్లో ప్రవేశించాలనే ఆలోచన లేదని వాంగ్‌చుక్ స్పష్టం చేశారు. యువకులే ఆ బాధ్యత చేపట్టాలన్నారు. రాజకీయవేత్తలు, ప్రభుత్వ అధికారుల పిల్లలు ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే చదవాలని తాను కోరుకుంటు న్నట్టు చెప్పారు. సీజేపీ నిరసనలకు ప్రభుత్వం అనుమతించడాన్ని ఆయన స్వాగతించారు. నిరసన తెలపడం తనకు ఇష్టం లేకున్నా న్యాయం కోసమే ఆ పని చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న విద్యావ్యవస్థలో మార్పు జరగాలని అన్నారు. కాగా, తదుపరి నిరసన ప్రదర్శనను జూన్ 23న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో నిర్వహించే ఆలోచనలో సీజేపీ ఉంది. ఈ కార్యక్రమంలో వందలాదిమంది యువత పాల్గొని కాక్రోజ్ జనతాపార్టీకి మద్దుతగా నిలిచారు.

# ధాన్యం కొనకుంటే మోడీ సంగతి తేలుస్తాం

**మొదటిపేజీ తరువాయి**

గాలివాన వచ్చినప్పుడు రైతులకు గాయాలయ్యాయి. ఇంటిగ్రేటెడ్ పండ్ల మార్కెట్ నిర్మిస్తానని నాడు ఎంపీగా ఉన్నప్పుడు హామీ ఇచ్చాను. పండ్లు, కూరగాయలు అన్నీ లభించేలా ఈ మార్కెట్‌ను నిర్మిస్తున్నాం అన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. తాగేందుకు నీళ్లు ఉండవు.. కూర్చునేందుకు స్థలం ఉండదు. అందుకే అన్ని వసతులతో కూడిన ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులు నిర్మిస్తున్నాం. అంతర్జాతీయ సదుపాయాలు కల్పించుకుంటేనే.. మనది అంతర్జాతీయ నగరం అవుతుంది. ఎవరెంత ఏడ్చినా.. ఆర్ఆర్ఆర్ ఆగదు. అభివృద్ధి కూడా ఆగదు. వ్యవసాయం దండగ కాదు.. పండగ అని నిరూపిస్తున్నాం. కాళేశ్వరం కూలేశ్వరం అయినా.. దేశంలోనే అత్యధిక వరి పండిస్తున్నాం. వరి వేస్తే.. ఉరే అని చెప్పిన రోజులు కావు ఇవి. వరి రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నాం అని గుర్తు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధికి అష్టదరిద్రులు అడ్డం పడుతున్నారని ధ్వజమెత్తారు. కాళ్లలో కట్టెలు పెట్టినా.. మూసీలో పడి దొర్లినా వాళ్లను పట్టించుకోమని విమర్శించారు. అసూయ పడేవాళ్లు, అజీర్ణం చేసుకునేవాళ్లు ఎప్పుడూ ఉంటారని ఎద్దేవా చేశారు. రూ.2,284 కోట్లతో 239 ఎకరాల్లో ఫ్రూట్ మార్కెట్ నిర్మిస్తున్నారు. చుక్కనీరు ఎత్తిపోయకుండా లక్షల మెట్రిక్ టన్నుల పంట పండలేదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడ నీళ్లున్నా కాళేశ్వరం నీళ్లు అనేవారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరాన్ని రూ.లక్ష కోట్లు వెచ్చిస్తే గోదావరి పాలయ్యాయని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో విధ్వంసం చేస్తే.. మేం వికాసం వైపు నడిపిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు అసూయ, పగ తమపై చూపండని.. కానీ ప్రజలపై కాదని చెప్పారు. సమస్యలు వస్తే పారిపోమని.. నిలబడి కొట్లాడి పరిష్కరించుకుంటామని అన్నారు. ఫామ్‌హౌస్ కేడీతోనైనా, ఢిల్లీలో మోదీతోనైనా కొట్లాడేందుకు సిద్ధమని వ్యాఖ్యానించారు. చేతకాకపోతే దిగిపొమ్మంటున్నారని.. తాము అల్లాటప్పాగా రాలేదని చెప్పారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సంగతి చెబుతామని హెచ్చరించారు. మర్యాద తప్పితే.. పొలిమేరలు కూడా దాటనివ్వమని వార్నింగ్ ఇచ్చారు. మోదీని చూపి భయపెట్టాలనుకుంటే.. ఇక్కడెవరూ భయపడేవారు లేరని చెప్పుకొచ్చారు ఈనెల 15 తర్వాత వడ్లు కొనకపోతే కేంద్రం సంగతి చూస్తామని హెచ్చరించారు. మాకు మాటలే కాదని.. చేతలు కూడా తెలుసునని అన్నారు. కేంద్రం నుంచి నిధులు ఎలా తెచ్చుకోవాలో తమకు తెలుసునని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం వేగంగా విస్తరిస్తోందని వ్యాఖ్యానించారు. భూముల ధరలు బాగా పెరిగాయని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ పెరగడంతో వ్యవసాయం కుంటుపడిందని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో 1.34 కోట్ల మంది నివసిస్తున్నారని తెలిపారు. ఒకప్పుడు హైదరాబాద్ చుట్టూ కూరగాయలు పండేవని వెల్లడించారు. గడ్డిఅన్నారం నుంచి ఫ్రూట్ మార్కెట్‌ని ఇక్కడికి తరలించారని ప్రస్తావించారు. రేకుల షెడ్లు వేస్తే.. అవి గాలి దుమారానికి ఎగిరిపోయాయని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ నిర్మిస్తామని హామీ ఇచ్చామని చెప్పారు. పండ్ల మార్కెట్ కోసం మనం చేసిన ప్రయత్నాన్ని అడ్డుకోవాలని చూశారని ధ్వజమెత్తారు. అందరి అవసరాలు తీర్చేలా మార్కెట్ నిర్మాణం చేయబోతున్నామని స్పష్టం చేశారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌తో ఏటా రూ.8 వేల కోట్ల ఆదాయం వస్తుందని తెలిపారు. మన ప్రాంతంలో రైతులు అన్ని రకాల పండ్లు పండించాలని ఆకాంక్షించారు. ఫార్మా సిటీ వద్దని ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేయబోతున్నామని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ స్థాయి కంపెనీలను ఇక్కడికి తీసుకురాబోతున్నామని వివరించారు. కాలుష్యం లేని పరిశ్రమలే ఈ ప్రాంతానికి వస్తాయని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ, మార్కెట్, ఆర్ఆర్ఆర్ వద్దంటూ అడ్డం పడుతున్నారని చెప్పుకొచ్చారు. వరంగల్ ఎయిర్‌పోర్టు వద్దని అడ్డుకుంటోందని ఆగ్రహించారు. గతంలో కావాలని మనం పోరాడితే.. ఇప్పుడు అష్టదరిద్రులు అడ్డం పడుతున్నారని దుయ్యబట్టారు. అభివృద్ధి చేద్దామంటే అడ్డుపడుతున్నారు.. ధర్నాలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. 2034 వరకు ప్రజాపాలన ఉంటుందని స్పష్టం చేశారు. ఔర్ ఏక్ బార్.. కాంగ్రెస్ సర్కార్.. తమ నినాదమని ఉద్ఘాటించారు. అభివృద్ధి పనులు చేసుకుంటూ ముందుకెళ్తామని చెప్పుకొచ్చారు. ఎంతమంది అడ్డం పడినా అభివృద్ధి పనులు ఆగవని తేల్చిచెప్పారు. సదుపాయాలు ఉంటేనే అంతర్జాతీయ స్థాయి నగరం అవుతుందని తెలిపారు. 'కారు' పూర్తిగా చెడిపోయి కార్ఖానాలో ఉంది. ఎన్ని మరమ్మతులు చేసినా.. చెడిపోయిన ఆ కారు ఇక పనికిరాదు. కేసీఆర్ కుర్చీ వేసుకొని కూర్చొని.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మిస్తానని చెప్పారు. కానీ.. గెలిచిన తర్వాత పట్టించుకోలేదు. మేం అభివృద్ధి చేస్తుంటే.. అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామని బీఆర్ఎస్ చెబుతోంది. కాలుష్యం వెదజల్లే ఫార్మాసిటీ వద్దని.. ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన 500 కంపెనీలు తీసుకురావాలని యత్నిస్తున్నాం. బీఆర్ఎస్ నేతలు దశాబ్దంలోనే శతాబ్దానికి సరిపడా విధ్వంసం చేశారు. తెలంగాణలో పండిన ధాన్యాన్ని కొనలేని మోదీ గ్ద్దె దిగాలి. రాహుల్ గాంధీని ప్రధాని చేసి.. మొత్తం ధాన్యాన్ని కేంద్రంతో కొనిపిస్తా. పాలమూరు- రంగారెడ్డికి జాతీయ హోదా తెస్తా. మెట్రో విస్తరణకు, ఆర్ఆర్ఆర్‌కు వెంటనే నిధులు తీసుకొస్తా అని సీఎం అన్నారు.

# ముందస్తు చర్యలకు సిద్ధం కండి

**మొదటిపేజీ తరువాయి**

భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించేలా అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న వరి కొనుగోళ్లను వేగవంతం చేసి, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మార్గనిర్దేశర చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని జిల్లా యంత్రాంగానికి సీఎస్ సూచించారు. వర్షాల పరిస్థితులపై నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేలా అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వర్షాల హెచ్చరికలు, వరి కొనుగోళ్లు, సీఎం పర్యటనల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. రైతులకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనల ఏర్పాట్లపైనా సీఎస్ అధికారులతో చర్చించారు. సీఎం పర్యటనలు విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లు, ప్రజాసభల నిర్వహణ, రవాణా సౌకర్యాలు, వసతి ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. వెంకటకృష్ణ ఉన్నారు.

# సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం

**మలేషియా ప్రతినిధి బృందందతో మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్,జూన్ 6 (ప్రజావినికిడి):** తెలంగాణలో సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు పూర్తి అనుకూల పరిస్థితులు ఉన్నాయని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. మలేషియా కంపెనీలు తెలంగాణలో భారీగా పెట్టుబడులు పెట్టేలా ముందుకు రావాలని సూచించారు. ప్రపంచ స్థాయి 'సెమీ కండక్టర్ ఎకోసిస్టం' అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పని చేస్తోందని వెల్లడించారు. హైదరాబాద్‌ను చిప్ డిజైన్, ఎలక్ట్రానిక్స్, అధునాతన సాంకేతిక రంగాల్లో అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. సెమీ కండక్టర్, ఏఐ, ఇన్నోవేషన్, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్ వంటి రంగాల్లో



అపార అవకాశాలు ఉన్నాయని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. తెలంగాణను 'గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్'గా మార్చేందుకు అంతర్జాతీయ భాగస్వామ్యాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. పెనాంగ్‌కు ఉన్న సెమీ కండక్టర్ అసెంబ్లీ, టెస్టింగ్, ప్యాకేజింగ్ అనుభవం తెలంగాణకు ఉపయోగపడు తుందని మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణ- మలేషియా మధ్య సాంకేతిక, పెట్టుబడి సహకారాన్ని బలోపేతం చేయాలని ఇరుపక్షాలు అంగీకరించాయి. మలేషియా ప్రతినిధి వైబీ జగదీప్ సింగ్ దియో తెలంగాణతో కలిసి పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
ఆదివారం 7 జూన్ 2026

# న్యాయవాదుల చట్టంపై సీఎంకు కృతజ్ఞత




**బషీర్ బాగ్,(ప్రజా వినికిడి):** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని అమలు చేయడం పట్ల తెలంగాణ న్యాయవాదుల సంక్షేమ సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల కృష్ణ, కన్వీనర్ పీ.రాజేష్ లు మాట్లాడుతూ న్యాయ వాదులకు హెల్త్ ఇన్సూరెన్స్ 2 లక్షల నుండి 5 లక్షల వరకు పెంచాలని కోరారు. ప్రతి జిల్లాలో అర్హులయిన న్యాయవాదులకు ఇంటి స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. యువ న్యాయవాదులకు వృత్తి రీత్యా కావలసిన మౌలిక సదుపాయాలకు 50 వేలు నగదు ప్రోత్సాహకం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో కో కన్వీనర్ విజయ్ సురేశ్, వైస్ ప్రెసిడెంట్ ఎం.వినోద్ కుమార్, న్యాయవాదులు విజయకుమారి, హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పరితపించిన గొప్ప కమ్యూనిస్ట్ యోధుడు చంద్ర రాజేశ్వర్ రావు

**సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ టి.నరసింహ**



**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** దేశంలోని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పరితపించిన గొప్ప కమ్యూనిస్ట్ యోధుడు చంద్ర రాజేశ్వర్ రావు అని సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ టి.నరసింహ కొనియాడారు. కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనేత చంద్ర రాజేశ్వర్ రావు 112 వ జయంతి సందర్భంగా హైదరాబాద్, హిమాయత్ నగర్, మఖ్దూమ్ భవన్ లో శనివారం ఈ టి.నరసింహ, సిపిఐ సీనియర్ నాయకులు కందిమల్ల ప్రతాపరెడ్డి,సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణి శంకర్,బాల నరసింహ, ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీ రంగరాజన్ తదితరులు అయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఈ టి. నరసింహ మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా 1946-51 మధ్యకాలంలో జరిగిన చారిత్రాత్మక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వెన్నుదన్నుగా నిలిచారని,పేద రైతులకు భూములు పంచే ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేసారు. సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా 28 సంవత్సరాల సుదీర్ఘ కాలం సేవలందించారని, పార్టీని బలోపేతం చేయడంలో, జాతీయ స్థాయిలో వామపక్ష ఉద్యమాలను నడపడంలో ఆయన క్రియాశీలకంగా వ్యవహరించారని తెలిపారు. ఆయన ఆశయాలు, స్ఫూర్తితో నేటి ప్రభుత్వాల ప్రజా వ్యతరేక విధానాలపై ఉద్యమించాలని ఈ టి.నరసింహ పిలుపునిచ్చారు. కందిమల్ల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ, స్వాతంత్ర్యం సాధించిన తర్వాత చంద్ర రాజేశ్వరరావు కమ్యూనిస్టు పార్టీ ద్వారా సామ్యవాది సిద్ధాంతాలను భారత రాజకీయాల్లో ముందుకు తీసుకెళ్లిన మహా నేత అని కొనియాడారు. పేదల కోసం జీవితాంతం పోరాడిన కమ్యూనిస్టు ఉద్యమ దార్శనికుడు చంద్ర రాజేశ్వరరావు స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పల్లె నరసింహ, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీవుల్లా ఖాద్రి,ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మణికంఠ రెడ్డి, పుట్టా లక్ష్మణ్,కన్నం లక్ష్మీనారాయణ, సురవరం కపిల్, మర్రి శ్రీమాన్, గోవిందరావు, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీని సందర్శించిన కాంగ్రెస్ నేతలు..

## ఈనెల 10న సీఎం రేవంత్ రెడ్డి రాక సందర్భంగా ఏర్పాట్ల పరిశీలన..





**మహేశ్వరం,(ప్రజావినికిడి):** ఈ నెల 10వ తేదీన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఫ్యూచర్ సిటీలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డెవలప్మెంట్ అథారిటీ,స్కిల్ యూనివర్సిటీల ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్న లక్ష్మారెడ్డి మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి ఇతర ముఖ్య నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బొక్క జంగారెడ్డి పిసిసి కార్యదర్శి అమరేందర్ రెడ్డి ఏఎంసీ చైర్మన్ కృష్ణ నాయక్, సరికొండమల్లేష్ రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ శ్రీధర్ అలాగే సామిడి గోపాల్ రెడ్డి,అల్లే కుమార్,ఐఎన్ టియుసి నడికుడి శివ,బొక్క భూపాల్ రెడ్డి వైస్ చైర్మన్ యాదయ్య, శివగల యాదయ్య, సురేందర్, బోయపల్లి గోవర్ధన్ రెడ్డి,మదనపాల్ రెడ్డి,కరుణాకర్ రెడ్డి,రాఘవేందర్ రెడ్డి,దంతోజు నరసింహ చారి, రజనీకాంత్, నిరంజన్,వెంకటేశ్వర్లు మండల అధ్యక్షులు, సర్పంచులు వార్డ్ మెంబర్లు కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర విద్యశాఖ మంత్రి రాజీనామా చేయాలి

## ఎఐఎస్ఎఫ్ డిమాండ్



**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** నీట్ పరీక్ష ప్రశ్నా పత్రం లీక్ ఘటనపై నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీరంగరాజు డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా విద్యార్థులంతా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్ననేపథ్యంలో ఆయనను కేంద్ర ప్రభుత్వం తక్షణమే బర్తరఫ్ చేయాల్సిందేనన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు దేశ వ్యాప్తంగా తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. నీట్, సిబిఎస్ఈ ప్రశ్నా ప్రతాల లీకెజికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్ఎఫ్ దేశ వ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా శనివారం హైదరాబాద్, హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద ఎఐఎస్ఎఫ్ రాష్ట్రసమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ నేతలు, విద్యార్థులు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవి రాజీనామా చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి దినేష్ శ్రీరంగరాజు మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా విద్యార్థుల తరపున కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలనే డిమాండ్‌తో నిరసనలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం గత 12 ఏళ్లుగా ప్రజల సమస్యలపై పోరాడే వారిపై విభజించే రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. అయితే ఈసారి దేశ యువత, ముఖ్యంగా విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ విధానాలను గట్టిగా ప్రశ్నిస్తున్నారని అన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడడం, మరోవైపు విద్యా వ్యవస్థలో నెలకొన్న లోపాల కారణంగా విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సిబిఎస్ఈ పరీక్షల నిర్వహణలో తీవ్ర అక్రమాలు,పోర్టల్ లోపాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. టెండర్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయని, గతంలో బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న ఒక సంస్థ పేరు మార్చుకుని మళ్లీ టెండర్ పొందిందని పేర్కొన్నారు. ఈ వ్యవహారాన్ని పెద్ద రాజకీయ నాయకులు కాకుండా 12వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులే బయటపెట్టారని, వారి ధైర్యాన్ని అభినందిస్తున్నన్నారు. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపి),పరీక్షల కేంద్రీకరణ విధానాల వల్లే ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని,నీట్‌తో పాటు కేంద్ర విద్యా విధానాలను మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అవలభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఎఐఎస్ఎఫ్ తదితర విద్యార్థి, యువజన సంఘాలు దేశవ్యాప్తంగా క్యాంపస్‌లలో ఆందోళనలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న కార్యకర్తలపై ఆర్ఎస్ఎస్ శ్రేణులు దాడి చేయడం దుర్మార్గమన్నారు. దేశవ్యాప్తంగా ఇలాంటి దాడులు జరుగుతున్నప్పటికీ తాము వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు వల్లి ఉల్లాఖాద్రీ, ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధక్షులు అశోక్ స్టాలిన్,రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, రాష్ట్ర ఆఫీస్ బెరర్స్ ఇటికాల రామకృష్ణ,బానోత్ రఘురాం,గ్యార నరేష్,రెహమాన్, గ్యార క్రాంతి, సొతుకు ప్రవీణ్, సి.రాజు, నాయకులు మచ్చ రమేష్,అనిల్, ఎండీ అన్వర్,ఎం. మురళీ కృష్ణ,బి. సంతోష్,జె. జనార్ధన్,ఎల్. శరత్,శాంతి కుమార్, పార్థసారథి, జోసెఫ్,మధు, ఉదయ్,సాగర్, యూనిస్,విజేత, జ్యోతి,రాజేశ్వరి, శైలజ,శ్రావణి లతో పాటు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్ జోన్ 119 డివిజన్ యూత్ జనరల్ సెక్రటరీగా సాయి కిరణ్ గౌడ్




**శంషాబాద్,(ప్రజావినికిడి):** శంషాబాద్ జోన్ 119 డివిజన్ యూత్ జనరల్ సెక్రటరీ గా సాయి కిరణ్ గౌడ్ (పెట్రోల్ సాయి) నియమితులయ్యారు. భారత రాష్ట్ర సమితి రాజేంద్రనగర్ ఇన్చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి చేతుల మీదుగా సాయి కిరణ్ గౌడ్ నియామక పత్రాన్ని అందుకున్నారు. సందర్భంగా సాయి కిరణ్ గౌడ్ మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పార్టీ అధికారంలోకి రావడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ కొనమల్ల శ్రీనివాస్, చిన్న గండు రాజేందర్, బుచ్చిరెడ్డి, హనుమంతు ముదిరాజ్,వెంకట్ రెడ్డి,రమేష్ రాథోడ్,రమేష్ రాచమల్ల,జీవీపీ సాగర్,శ్రీకాంత్, రజనీకాంత్ రాచమల్ల కార్తీక్,మల్లేష్ మంచాల,మంచర్ల కిట్టు,శేఖర్ రోవన్ మణికంఠ పాల్గొన్నారు.

# చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది ప్రభుత్వ పాఠశాలలోనే

**ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు**

**నాణ్యమైన ప్రాథమిక విద్యను అందించేందుకు ప్రభుత్వం అనేక రకాలు చర్యలు**

**శంషాబాద్ మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్**



**శంషాబాద్, (ప్రజావినికిడి):** చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలనే లక్ష్యంతో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అనేక రకాల చర్యలు చేపడుతున్నాయని శంషాబాద్ మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ మండల పరిధిలోని శనివారం మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ, ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన ప్రాథమిక విద్య అందించేందుకు 2026-27 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 2,769 కొత్త ప్రీ ప్రైమరీ పాఠశాలలను ప్రారంభించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. ఈ మేరకు విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలాస్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. శంషాబాద్ మండల పరిధిలోని మండల ప్రాథమిక పాఠశాల సాతంరాయి, మండల ప్రాథమిక పాఠశాల సాతంరాయి కాలనీ,మండల ప్రాథమికోన్నత పాఠశాల చిన్నగొల్లపల్లి పాఠశాలలో ప్రీ-ప్రైమరీ స్కూల్ టీచర్లు (ఇన్‌స్ట్రక్టర్లు), ఆయాల నియామకాలు జరుగుతున్నాయని..చిన్న వయసు నుంచే ప్రభుత్వ విద్యా వ్యవస్థపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచడంతో పాటు, పేద,మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశం మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ తెలిపారు. ప్రీ ప్రైమరీ టీచర్ పోస్టులకు ఇంటర్మీడియట్ తో పాటు డీఈడీ లేదా ప్రీ-ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ సర్టిఫికెట్ ఉండాలన్నారు. ఆయాలకు కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలి అని తెలిపారు. ప్రీ ప్రైమరీ టీచర్లకు నెలకు 8 వేలు,ఆయాలకు 6వేలు గౌరవ వేతనం ఉంటుందని,ఈ నియామకాలు పూర్తిగా తాత్కాలిక పద్ధతిలో ఉంటాయని స్థానికులకు ప్రాధాన్యత ఉంటుందని,ఈ సందర్భంగా అన్నారు. ఇన్స్ట్రక్టర్,ఆయా పోస్టులకు అర్హతలు కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు సోమవారం సాయంత్రం వరకు మండల విద్యాశాఖ కార్యాలయం శంషాబాద్ లో ఇవ్వాలని కోరారు.

# బిఆర్ఎస్ మహిళ నాయకురాళ్ల సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి




**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):** ఎల్బీనగర్ బిఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాళ్ల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. మహిళల సాధికారత, సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని తెలిపారు. పార్టీ తరఫున మహిళలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని,వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే మహిళలు రాజకీయ, సామాజిక రంగాల్లో మరింత చురుకుగా పాల్గొని నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. పార్టీ బలోపేతానికి మహిళా కార్యకర్తలు చేస్తున్న సేవలను అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ మహిళా నాయకురాళ్లు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అసాధ్యం అన్నారు..

# సుసాధ్యం చేశావ్..



## పట్టు వదలని విక్రమార్కుడు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..

### సవ్యసాచి గురితప్పని లక్ష్మీదేవి పల్లి..

### సీఎంను వేధించి మరి సాధించిన వీర్లపల్లి..

### అనుమానాలను పటాపంచలు చేస్తూ సాధించిన రిజర్వాయర్..

### భూసేకరణ కోసం మంత్రులు, అధికారులతో సమీక్ష..

### లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ కు రంగం సిద్ధం..








**షాద్ నగర్,(ప్రజావినికిడి):**

చుట్టుముట్టు ఎన్ని ఉన్నా సవ్యసాచిగా పేరున్న అర్జునుడి గురి మాత్రం కేవలం మచ్చ యంత్రంలో ఉన్న చేప మీదే ఉంటుంది..అలా ఎమ్మెల్యే అయ్యాక ఎన్నో పనుల ఒత్తిడి ఉన్నా.. ఒక్కొక్కటిగా పూర్తి చేస్తున్నా ఆయన దృష్టి మాత్రం ప్రధానంగా నియోజకవర్గంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ మీదే ఉంది.పాలమూరు ప్రాజెక్టులో అంతర్భాగమైన ఈ రిజర్వాయర్ ను గత ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందికెసిఆర్ వల్లనే కాని పని వీర్లపల్లి వాళ్ళ అవుతుందా.. అన్న అనుమానాలను పటాపంచలు చేశాడు.. పట్టువదలని విక్రమార్కుడిలా అడుగు ముందుకు వేసి అనుకున్నది సాధించాడు. లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ విషయంలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సాధించిన ఘనత ఇది.వ్యవసాయం చేసుకునే నియోజకవర్గ ప్రజలకు చిరకాలం పాటు గుర్తుండిపోయే రిజర్వాయర్ కలను సాకారం చేసిన ఘనత ఎమ్మెల్యే వీర్లపల్లి దక్కించుకోగలిగారు.ఒక్కసారి ఈ రిజర్వాయర్ పూర్వకథలోకి, వర్తమాన పరిస్థితుల్లోకి తొంగి చూస్తే..

### నిన్నటి కథ..

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో అంతర్భాగమైన లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ కు సంబంధించి బీఆర్ఎస్ హాయాంలోనే బీజం పడినప్పటికీ మొత్తం 21 ప్యాకేజీలకు గాను 18 ప్యాకేజీలు మాత్రమే పూర్తి చేయగలిగారు. ఉదండాపూర్ వరకు పనులు జరిగాయి. లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ విషయంలో మాత్రం భూసేకరణ పేరిట జిల్లా కలెక్టర్ సమావేశాలు నిర్వహించినప్పటికీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.ఈ క్రమంలో ప్రతిపక్ష నాయకుడిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కీలకపాత్ర పోషించారు. పలుమార్లు రిజర్వాయర్ పై ఉద్యమించడమే కాకుండా అప్పటి సీఎల్పీ నేత ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క,ప్రస్తుత మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి,ప్రజా నాయకుడు గద్దర్ తదితర నేతలను తీసుకువచ్చి సమావేశాలు ఏర్పాటు చేసి విషయం వేడెక్కేలా చేశాడు. కానీ బీఆర్ఎస్ హయాంలో ఇది సాకారం కాని కలగానే మిగిలిపోయింది. ఇక వర్తమానం లోకి వస్తే..

### అలుపు లేని పోరాటం..

ఎమ్మెల్యేగా అధికారంలో ఉన్నప్పటికీ ఒక విధంగా లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అలుపెరుగని పోరాటం చేశారనే చెప్పాలి. పలుమార్లు సీఎం వెంట తిరిగి ఆయననే ఈ రిజర్వాయర్ కోసం వేధించారు.అలాగే మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి తో పాటు ప్రతి మంత్రిని కలిసి రిజర్వాయర్ గురించి ప్రస్తావించారు. ఇక్కడ నియోజకవర్గంలోని రైతాంగం ఈ ప్రాజెక్టు మీద ఎన్ని ఆశలు పెట్టుకుందో సవివరంగా చెప్పి తన వంతు ప్రయత్నం చేశారు. మొత్తానికి ఆయన ప్రయత్నం ఫలించింది. పాలమూరు ప్రాజెక్టుకు కొత్త రూపాన్ని ఇవ్వడమే కాకుండా లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణ కోసం తొలి విడతగా 587 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది అంటే దీని వెనుక వీర్లపల్లి శంకర్ కృషి అసమాన్యం.. అనిర్వచనీయం..

### సీఎం కదిలి వచ్చిన వేళ..

పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో ప్రత్యేకంగా సీఎం రేవంత్ రెడ్డి కదిలి వచ్చి మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు,వాకిటి శ్రీహరి ఇలాంటి వాళ్ళతో కలిసి సోమశిలలో సమీక్ష సమావేశం నిర్వహించారంటే దీని వెనక లక్ష్మీదేవి పల్లి కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన ప్రయత్నమే ప్రధాన కారణం.18 ప్యాకేజీలు పూర్తి చేసి 19,2021 ప్యాకేజీలను మాత్రం గత ప్రభుత్వం వదిలేసింది. ఇందులో భాగమే లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్. దీనిపై ఎమ్మెల్యే వీర్నపల్లి శంకర్ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి వినతిపత్రం అందించారు. కొందరు మండలం లక్ష్మీదేవి పల్లి లో భూసేకరణ తక్షణమే చేపట్టాలని కోరారు.దీనివల్ల షాద్ నగర్ తో పాటు,పరిగి నియోజకవర్గానికి కూడా ప్రయోజనం ఉండడంతో ఇందులో అక్కడికి ఎమ్మెల్యే రామ్మోహన్ ను కూడా రామ్మోహన్ రెడ్డిని కూడా భాగస్వామిని చేశారు. ఇరువైపుల నుంచి ఒత్తిడి ఉండడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా స్పందించి ఈ రిజర్వాయర్ కు మోక్షం కల్పించారు. ప్రస్తుతం ఇక్కడ భూసేకరణకు వేగంగా రంగం సిద్ధం అవుతుంది. రైతాంగం కల త్వరలోనే సాకారం కాబోతుంది.





### అసాధ్యుడవి శంకరన్న..


గతంలో 10 ఏళ్ల పాటు పాలించిన సీనియర్ నాయకుల వల్లనే కాని పని కొత్తగా ఎమ్మెల్యేగా అడుగుపెట్టిన వీర్లపల్లి శంకర్ వల్ల అవుతుందా..? వీర్లపల్లి శంకర్ అమాయకుడు.. ఇది అతని వల్ల కాదు..ఇలాంటి విమర్శలు అన్నింటిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పటా పంచలు చేశారు. అర్జునుడు చేప మీద దృష్టి పెట్టినట్లు వచ్చినప్పటి నుంచి లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టు మీద ప్రత్యేక దృష్టి పెట్టి రిజర్వాయర్ ను తెరమీదకి తెచ్చి అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించాడు. అమాయకుడు కాదు అసాధ్యుడు అని నిరూపించారు. దీనికి కారణం ప్రధానంగా ఎమ్మెల్యేకు డబ్బు మీద ఆశ లేకపోవడం. ఎమ్మెల్యేగా అధికారంలోకి వచ్చినందుకు ప్రజలకు గుర్తుండిపోయేలా ఏదో ఒకటి చేయాలనే సంకల్పాన్ని మనసులో ఉంచుకోవడం. భాగంగానే సొంత ఖర్చులతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల,సీఎంతో పట్టుబట్టి మరి సాధించిన ఏకీ కృత పాఠశాల, ప్రస్తుత లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్. అందుకే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సర్వత్ర అభినందనలు అందుకుంటున్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వేధించి సాధించి మరి తన నియోజకవర్గానికి లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ ను సాధించుకున్నట్టు ప్రభుత్వ పెద్దలే చెబుతున్నారు. కృత నిశ్చయంతో తాను పట్టుబడితే ఏదైనా సాధించగలనని నిరూపించారు. శంకరన్న..నువ్వు సూపర్..

# జూన్ 8న ప్రజావాణి రద్దు

**ఖమ్మం/, జూన్ 6 (ప్రజావినికిడి):** జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 8వ తేదీన రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ప్రకటించారు.సోమవారం నిర్వహించనున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొననున్న నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం లేదని శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.ప్రజలు ఈ మార్పును గమనించి, తమ వినతులు, ఫిర్యాదుల సమర్పణకు తదుపరి ప్రజావాణి తేదీని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లా యంత్రాంగం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

# గంధంపల్లిలో నార్కోటిక్ డాగ్ రోలెక్స్ తనిఖీలు.





**బయ్యారం,జూన్ 6(ప్రజావినికిడి):**మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఆదేశాల మేరకు గార్లబయ్యారం సీఐ రవీందర్, బయ్యారం ఎస్సై ప్రశాంత్ బాబు ఆధ్వర్యంలో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సిబ్బందితో కలిసి గంధంపల్లి గ్రామంలో గంజాయి నిర్మూలనలో భాగంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా పాన్ షాపులు, బస్ స్టాప్‌లు,పాఠశాలల పరిసర ప్రాంతాలు మరియు యువకులు గుమికూడే ప్రదేశాల్లో తనిఖీలు చేపట్టి,గంజాయి వినియోగం,విక్రయాలు,అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు 8712656999 నంబర్‌కు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

# ఆనంద్‌నగర్ కాలనీలో లిఫ్ట్ ప్రమాదం

## మహిళ మృతి..బాలుడికి తీవ్ర గాయాలు



**హైదరాబాద్,జూన్ 6 (ప్రజావినికిడి):** ఖైరతాబాద్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. ఆనంద్ నగర్ కాలనీలో ఉన్న భావన అపార్ట్‌మెంట్స్‌లో లిఫ్ట్ ప్రమాదంలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోగా, ఆమెతో ఉన్న మనవడు గాయపడ్డాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్ ఆనంద్ నగర్ కాలనీలోని భావన అపార్ట్‌మెంట్స్ లో లిఫ్ట్‌లో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రాధ (58) అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ప్రమాదం అపార్ట్‌మెంట్ 5వ అంతస్తులో జరిగింది. లిఫ్ట్ పూర్తిగా ఆ అంతస్తుకు చేరుకోకముందే బాధితురాలు తలుపు తెరిచింది. దీంతో ఆమె ఒక్కసారిగా లిఫ్ట్ గుంతలో పడిపోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. ఆమెతో పాటు ఉన్న 13 నెలల మనవడు జియోల్ గాయపడటంతో వెంటనే సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ ఘటన అనంతరం అపార్ట్‌మెంట్ నివాసితులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

# నవజాత శిశువుల ఆరోగ్యం గుర్తింపు

## శిశుమాపన్ యాప్‌ను ప్రారంభించిన ప్రభుత్వం

## ఎఐతో అనుసంధానించినట్లు మంత్రి సత్యకుమార్ వెల్లడి

**అమరావతి,జూన్ 6 (ప్రజావినికిడి):** నవజాత శిశువుల ఆరోగ్య ప్రమాణాలను సులభంగా, ఖచ్చితంగా గుర్తించేందుకు ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తెచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత ఆధారంగా పనిచేసే 'శిశు మాపన్' యాప్‌ను ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. ఈ నూతన విధానం ద్వారా పుట్టిన పిల్లలను చేతులతో తాకాల్సిన అవసరం లేకుండానే.. కేవలం మొబైల్ వీడియో ద్వారా వారి ఆరోగ్య వివరాలను రికార్డు చేయవచ్చు.సాధారణంగా నవజాత శిశువుల బరువు, ఎత్తు, తల, ఛాతీ చుట్టుకొలతలను సాంప్రదాయ పద్ధతుల్లో కొలవడం కొంత శ్రమతో కూడుకున్న పని. క్షేత్రస్థాయిలో ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు గాను.. ప్రస్తుతం వినియోగంలో ఉన్న 'ఆశా' యాప్‌తో ఈ 'శిశు మాపన్' యాప్‌ను అనుసంధానించారు. ఈ సరికొత్త ప్రాజెక్ట్‌ను మంగళగిరి నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం లకు ఈ యాప్ వినియోగంపై ప్రత్యేక శిక్షణ కూడా పూర్తి చేశారు. మంగళగిరిలో సాధించే ఫలితాలు, క్షేత్రస్థాయి అనుభవాలను పరిశీలించిన అనంతరం ఈ అధునాతన ఏఐ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

# వరి కొయ్యలను కాల్చే రైతులపై చర్యలు

## 8 మంది రైతులకు 5 వేల చొప్పున జరిమానా

**జగిత్యాల,జూన్ 6 (ప్రజావినికిడి):** వరి కొయ్యలను కాల్చే రైతులపై ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. పంట పొలాలలో వరి కొయ్యలు కాల్చిన 8 మంది రైతులకు 5 వేల రూపాయల చొప్పున జరిమానా విధించింది. కథలాపూర్ మండలం రాజారామ్ తండాలో వరి కొయ్యలకు రైతులు నిప్పంటించారు. ఈ విషయం తెలుసుకున్న వ్యవసాయ శాఖ అధికారులు గ్రామ పంచాయతీ సమక్షంలో రైతులకు జరిమానా విధించారు.

గతంలో వరి కొయ్యలను కాల్చరాదని గ్రామ పంచాయతీలో గ్రామస్తులు తీర్మానం చేశారు. పంట అవశేషాలను కాల్చకుండా శాస్త్రీయ పద్దతిలో నిర్వహించి నేల సారాన్ని కాపాడాలని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో వరి కొయ్యలను కాల్చితే కఠిన చర్యలు తీసుకుంటామని రైతులను హెచ్చరించారు. వరి కొయ్యలు కాల్చడాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం జీవో 27 జారీ చేసింది. ఈ జీవో ప్రకారం నిబంధనలను ఉల్లంఘించిన వారికి పర్యావరణ పరిహారం పేరిట భారీ జరిమానాలు విధిస్తారు. బహిరంగంగా పంట వ్యర్థాలను తగలబెట్టే తీవ్రతను బట్టి రూ.5 వేల నుంచి రూ.25 వేల వరకు జరిమానాలు విధించి ఆయా గ్రామ పంచాయతీలు జరిమానాలు వసూలు చేస్తాయి. ఈ విషయాలను వ్యవసాయ అధికారులు రైతులకు వివరిస్తున్నా వరి కొయ్యలను రైతులు కాలుస్తూ ప్రమాదాలు కారణమవుతున్నారు.జగిత్యాల జిల్లాలో రైతులు పంట అవశేషాలను, వరి కొయ్యలను కాల్చవద్దని, అలా చేస్తేవారికి జరిమానా విధిస్తామని కలెక్టర్ సత్యప్రసాద్ హెచ్చరించారు. వరి కొయ్యల దహనం వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు భూమిలోని సేంద్రియ కార్బన్, వానపాములు నశించి భూసారం తగ్గుతుందన్నారు. అంతేకాకుండా మంటలు అదుపు తప్పి సమీపంలోని ఆయిల్ పామ్, మామిడి తోటలకు వ్యాపించి రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంట అవశేషాలను తగలబెడితే రూ.5,000 నుంచి రూ.25,000 వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

# కోడి పందాల స్థావరాలపై పోలీసులు దాడి..

## శంషాబాద్ బురుజు గడ్డ తండాలో గుర్తుచప్పుడు కాకుండా కోడిపందాలు..

## పంద్యాలు కాస్తున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు..







**శంషాబాద్,(ప్రజావినికిడి):** శంషాబాద్ బురుజు గడ్డ తండాలో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న కోడిపందాల స్థావరాలపై ఎస్.ఓ.టి పోలీసులు మెరుపు దాడులు చేశారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని బురుజు గడ్డ తండాలో శనివారం గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న కోడిపందాల స్థావరాలపై ఎస్ఓటి పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. తండాలో అక్రమంగా సాగుతున్న కోడిపందాల గుట్టును రట్టు చేసి,పంద్యాలు కాస్తున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనా స్థలం నుంచి రూ.9,900 నగదును, పందాలకు ఉపయోగించిన కోళ్లు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కోడిపందాల నిర్వహణను పర్యవేక్షిస్తున్న ప్రధాన నిర్వాహకుడు పరారీలో ఉన్నారని, పరారీలో ఉన్న నిందితుని కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఓటి పోలీసులు మాట్లాడుతూ, అక్రమ జూద కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# విత్తన, పురుగుమందుల దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ ఆకస్మిక తనిఖీలు

## పంట అవశేషాలు కాల్చితే రూ.25 వేల వరకు జరిమానా: జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య



**ఏన్కూర్, /జూన్ 6(ప్రజావినికిడి):** ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో నకిలీ విత్తనాలు, నాసిరకం పురుగుమందుల విక్రయాలను అరికట్టేందుకు వ్యవసాయ శాఖ అప్రమత్తమైంది. ఇందులో భాగంగా జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య నేతృత్వంలోని టాస్క్‌ఫోర్స్ బృందం శనివారం ఏన్కూర్ మండల కేంద్రంలోని పలు విత్తన, పురుగుమందుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది.ఈ సందర్భంగా దుకాణాల్లో నిల్వలు, విక్రయ రికార్డులు, లైసెన్సులు, స్టాక్ వివరాలను పరిశీలించారు. ప్రతి దుకాణం వద్ద స్టాక్ బోర్డును తప్పనిసరిగా ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులో ఉంచాలని వ్యాపారులకు సూచించారు. రైతులను మోసగించే నకిలీ విత్తనాలు, నాసిరకం వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలపై ప్రభుత్వం ఏమాత్రం ఉపేక్షించబోదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.అనంతరం రైతులతో మాట్లాడిన జిల్లా వ్యవసాయ అధికారి, పంట కోతల అనంతరం అవశేషాలను తగులబెట్టే విధానాన్ని పూర్తిగా మానుకోవాలని సూచించారు. మొక్కజొన్న, వరి తదితర పంటల అవశేషాలను భూమిలో కలియదున్నడం ద్వారా నేలలో కార్బన్ శాతం పెరిగి భూసారం మెరుగుపడుతుందని వివరించారు. పంట అవశేషాల దహనం వల్ల పర్యావరణానికి, నేల ఆరోగ్యానికి తీవ్ర నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. ఇకపై పంట అవశేషాలను కాల్చినట్లు గుర్తిస్తే నిబంధనల ప్రకారం రూ.5 వేల నుంచి రూ.25 వేల వరకు జరిమానా విధించనున్నట్లు ఆయన హెచ్చరించారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలను పాటించి సుస్థిర వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని కోరారు

# గిగ్ వర్కర్లుగా మహిళలు

## స్త్రీ రైడ్ ప్రోగ్రామ్ కింద 55మందికి శిక్షణ - 'స్త్రీ రైడ్' ప్రాజెక్టును ప్రారంభించిన డీజీపీ సీవీ ఆనంద్



**హైదరాబాద్,జూన్ 6 (ప్రజావినికిడి):** : గిగ్ వర్కర్లలో ఇప్పుడు మహిళలు కూడా చేరబోతున్నారని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో స్త్రీ రైడ్స్‌ను తీసుకొచ్చామని పేర్కొన్నారు. 55 మంది మహిళలకు డ్రైవింగ్ నేర్పించి, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని చెప్పుకొచ్చారు.మహిళల ఆర్థిక స్వావలంబన, ఆత్మవిశ్వాసం, సమాజంలో వారి భద్రతను పెంపొందించడమే ధ్యేయంగా తెలంగాణ పోలీస్ శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విమెన్ సేఫ్టీ వింగ్, రాష్ట్ర రవాణా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన 'స్త్రీ రైడ్' ప్రాజెక్టును హైదరాబాద్‌లో డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు. మహిళలు రవాణా, డెలివరీ రంగాల్లో స్వయం ఉపాధి సాధించేలా ప్రోత్సహించేందుకు ఈ-బైక్స్, ఈ-ఆటోలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. తొలి విడతలో 55 మంది మహిళలకు స్త్రీ రైడర్లుగా అవకాశం కల్పించారు. అంబర్‌పేట పోలీస్ లైన్స్‌లో వీరికి టూ వీలర్, త్రీ వీలర్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చారు. 55 మంది మహిళలకు ఈమేరకు డ్రైవింగ్ లైసెన్సులు అందజేశారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు సురక్షిత రవాణా సేవలు అందించేలా ఈ కార్యక్రమం చేపట్టారు. జొమాటో, స్విగ్గీ తరహా డెలివరీ సేవల్లో మహిళల భాగస్వామ్యంపై డీజీపీ హర్షం వ్యక్తం చేశారు. నాలుగు నెలల్లో మహిళా రైడర్ల సంఖ్యను మూడింతలు పెంచాలన్నారు. మహిళల ఉపాధి, సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తోందని పేర్కొన్నారు. ఇప్పటివరకు గిగ్ వర్క్‌లో పురుషులు ఉండేవారని, ఇప్పటినుంచి మహిళలు కూడా రాబోతున్నారని తెలిపారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా సాధికారిత సాధించాలని ఆనంద్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్ సిటీ పోలీస్ చరిత్రలో లా అండ్ ఆర్డర్ పోలీసుస్టేషన్‌కు.. మహిళా ఎస్‌హెచ్‌వో లేరని డీజీపీ ఆనంద్ వివరించారు. తాను హైదరాబాద్ సీపీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మహిళా ఇన్‌స్పెక్టర్లను ఎస్‌హెచ్‌వోలుగా నియమించానని ప్రస్తావించారు. ఇప్పుడు 55 మంది మహిళలు ప్యాసింజర్ రవాణా సేవలు అందిస్తున్నారని వెల్లడించారు. భవిష్యత్తులో తెలంగాణ అంతటా లాజిస్టిక్, కార్గో, డెలివరీ సర్వీసెస్‌లో మహిళా డ్రైవర్లకు అవకాశం కల్పిస్తామని చెప్పుకొచ్చారు. దేశ జీడీపీ పెరగాలంటే మహిళలు కూడా ధైర్యంగా బయటకు వచ్చి పని చేయాలని డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు.

# గండిపేట భూకబ్జా కేసు వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లాకు 14 రోజుల రిమాండ్

## చంచల్‌గూడ జైలుకు తరలించిన పోలీసులు



**హైదరాబాద్,జూన్ 6 (ప్రజావినికిడి):** గండిపేట భూకబ్జా కేసులో అరెస్టైన వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు ఉప్పరపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఆయనను చంచల్‌గూడా జైలుకు తరలించారు. ఈ కేసు తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, భూకబ్జా కేసులో నిందితుడిగా ఉన్న బొల్లా బ్రహ్మనాయుడిని సైబరాబాద్ పోలీసులు తమిళనాడులోని కాంచీపురంలో అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనను రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్‌కు తీసుకువచ్చి నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో భాగంగా స్టేట్‌మెంట్ నమోదు చేసిన అధికారులు, ఆ తర్వాత న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. బొల్లా బ్రహ్మనాయుడిని నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తీసుకువస్తున్నారనే సమాచారం అందడంతో వైసీపీ కార్యకర్తలు, ఆయన అనుచరులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా పోలీస్ స్టేషన్‌లోకి ఎవరినీ అనుమతించ లేదు. దీంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నార్సింగి పోలీస్ స్టేషన్ నుంచి బొల్లా బ్రహ్మనాయుడిని కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉప్పరపల్లి కోర్టుకు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వాదనలు విన్న కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. అనంతరం చంచల్‌గూడా జైలుకు పంపించారు. గండిపేట భూకబ్జా కేసులో ఇప్పటికే ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. బొల్లా బ్రహ్మనాయుడు అరెస్టుతో మొత్తం అరెస్టుల సంఖ్య ఆరుకు చేరాయి. ఈ కేసులో మరికొంతమందిని కూడా విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భూకబ్జాకు సంబంధించిన పలు కోణాల్లో సైబరాబాద్ పోలీసులు విచారణ చేపట్టారు. భూముల ఆక్రమణ, పత్రాల వ్యవహారం, సంబంధిత వ్యక్తుల పాత్ర వంటి అంశాలపై అధికారులు సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా మరిన్ని చర్యలు చేపట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. గండిపేట భూకబ్జా కేసులో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడి అరెస్ట్, అనంతరం కోర్టు రిమాండ్ విధించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట ఏదీ ?

**జూన్ 6(ప్రజావినికిడి):**
ఆర్థిక కుంభకోణాలు, మోసాలను పసిగట్టలేక పోతున్నారు. దేశంలో ఎవరు ఎలా దోచేస్తున్నారో గుర్తించడం లేదు. అధికారంలో ఉన్నవారిది ఒక రకమైన దోపిడీ, ఆర్థికంగా ఉన్నవారిది మరో రకమైన దోపిడీ అన్నట్లుగా కాలం నడుస్తోంది. అధికారంలో ఉండి ఆర్థిక మోసాలకు పాల్పడ్డ వారిని ఏమీ చేయడం లేదు. వారు అక్రమాలకు పాల్పడ్డట్లు రుజువులున్నా బోను ఎక్కించడం లేదు. తమ అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇష్టారాజ్యంగా చేస్తున్న పనులపై నిఘా లేకుండా పోయింది. అజమాయిషీ లేదు. విచారణలు లేవు. తెలంగాణలో కాళేశ్వరం కథ కంచికి చేరింది. లక్షకోట్లు పెట్టి ఓ ప్రాజెక్ట్ కడితే అందులో అవతవకలు, ఆర్థిక మోసాలు జరిగాయన్న వారే దానిపై విచారణ జరిపించడం లేదు. ఇ- కార్ రేసులో నేరుగా విదేశీ సంస్థకు డబ్బులు చెల్లించినా కిమ్మనడం లేదు. ఎపిలో రుషికొండపై జగన్ ప్యాలెస్‌లు కట్టుకుంటే చర్యలు లేవు. మద్యం కుంభకోణానికి పాల్పడితే దిక్కులేదు. భూకుంభకోణ్యాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికే దేశంలో అనేక ఆర్థిక మోసాలు జరిగాయి. విజయ్ మాల్యా, నీరవ్ మోడీ, లలిత్ మోడీ వంటివారు దేశం బయటనే ఉన్నారు. వారిపై ఎలాంటి చర్యలు లేవు. దేశంలో కొందరు బ్యాంకులకు ఎగనామం వేస్తున్నా పట్టింపు లేదు. ఇవన్నీ కూడా ఇతరకుల ఆదర్శంగా నిలుస్తున్నాయని భావించాలి. తాజాగా రాజేష్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్ (ఆర్‌ఇఎల్) భారీ ఆర్థిక అరాచకం దేశంలోనే కాదు అంతర్జాతీయ కార్పొరేట్ రంగాన్ని షేక్ చేస్తోంది. ఇలాంటి వారు మోసం చేస్తున్నా..గుర్తించలేక పోయారు. ఎల్‌ఐసి లాంటి సంస్థ ఇందులో పెట్టుబడులు పెట్టి ఇప్పుడు భారీగా నష్టపోయింది. ఆర్థిక మోసాలను ఎంత చాకచక్యంగా చక్కబెట్టవచ్చో 'లక్కీ భాస్కర్' మూవీలో చూపించారు. 1980లనాటి షేర్ల స్కామ్ కింగ్ పిన్ బిగ్‌బుల్ హర్షద్ మెహతా షేర్ మార్కెట్‌ను ఎలా మోసం చేశడో గుర్తుండే ఉంటుంది. వ్యవస్థలోని లొసుగులను తమకు అనుకూలంగా మార్చుకొంటున్న పలువురు భారీ అక్రమాలకు బరితెగిస్తున్నారు. వారి చేతుల్లో ఎంతోమంది అమాయకులు మోసపోతున్నారు. సహారా ఇండియా, అగ్రిగోల్డ్, లీఫిన్ ఇండియా లాంటి సంస్థలు కూడా ఎంతగా మోసం చేశాయో చూసాం. ఇటీవల నల్లగొండ, కర్నూలు జిల్లాలో మైక్రో ఫైనాన్స్ మోసం బయటపడింది. అయినా ప్రభుత్వాలు కళ్లు తెరవడం లేదు. కఠిన నిర్ణయాలు తీసుకోవడం లేదు. చిట్టీల పేరుతో గ్రామాలు మొదలు పట్టణ్యాల వరకు కోట్లల్లో మోసలు చేస్తూనే ఉన్నారు. తాజాగా బెంగళూరుకు చెందిన ప్రముఖ బంగారం, ఆభరణాల దిగ్గజం ఆర్‌ఇఎల్ తన వాస్తవ ఆదాయాన్ని రూ.15.15 లక్షల కోట్లు అధికంగా చూపించి, తన షేర్ వాల్యూను భారీగా పెంచుకొని, మదుపరులను, అలాగే ప్రభుత్వ వ్యవస్థలను మోసగించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని సెక్యూర్టీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా సెబి విచారిస్తే తప్ప వెలుగులోకి రాలేదు. ఆర్‌ఇఎల్ స్కాం దేశ కార్పొరేట్ చరిత్రలో అతిపెద్ద కుంభకోణంగా చెబుతున్నారు. ఇలాంటి స్కామే 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సత్యం కంపెనీలో జరిగింది. రూ.7,800 కోట్ల మేర కంపెనీ బ్యాలెన్స్‌షీట్‌లో తేడా వచ్చింది. ఎక్కువ ఆదాయం చూపించి సత్యం




కంపెనీ షేర్ విలువను పెంచుకుందని ఆరోపణలొచ్చాయి. ఈ కేసులో సత్యం కంపెనీ అధినేత రామలింగరాజుకు ఏడేళ్ల జైలు శిక్ష పడింది. అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ అదానీ కంపెనీ ఆర్థిక మోసాలను ఆధారాలతో సహా 2003 జనవరిలో బయటపెట్టడం పెను సంచలనం అయింది. ఆదానీ గ్రూపు తమ షేర్ విలువను పెంచుకునేందుకు గ్రూపు ఆదాయాన్ని అధికంగా చూపించడంతోపాటు పలు ఆర్థిక అవకతవకలకు పాల్పడిందన్నది ప్రధాన అభియోగం. దాంతో అదానీ ఆర్థిక సామ్రాజ్యం రూ.లక్షల కోట్ల మేర పతనమైంది. తూతూ మంత్రంగా సెబి దర్యాప్తు సాగింది. చివరికి అదానీ గ్రూపుపై 'హిండెన్‌బర్గ్'వి ఆధారాల్లేని ఆరోపణలుగా కొట్టిపారేసింది. ఉదారవాద ఆర్థిక విధానాలే ఆర్థిక స్కాంలకు మూలం. ఓ సామాన్యుడు సెబీకి లేఖ రాయడం, అది విచరణ చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఆర్‌ఇఎల్ కంపెనీ ప్రమోటర్, ప్రస్తుత ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అయిన రాజేష్ మెహతాను సెక్యూర్టీస్ మార్కెట్ నుంచి తాత్కాలికంగా నిషేధించింది. ఆర్‌ఇఎల్ అక్రమాలను కేంద్ర ప్రభుత్వ సంస్థలుకానీ, నిఘా విభాగాలు కానీ గుర్తించలేకపోవడం వ్యవస్థీకృతంగా ఉన్న జాడ్యంగా చూడాలి. ఒక సాధారణ ఇన్వెస్టర్ 2025లో ఇ-మెయిల్‌లో చేసిన ఫిర్యాదుతో తీగ లాగితే డొంక కదిలింది. సెబి రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టినా, కంపెనీకి సంబంధించిన ఆడిట్ రిపోర్టులను చూపించమని పలు మార్లు నోటీసులిచ్చినా ఆర్‌ఇఎల్ యాజమాన్యం సహకరించలేదు. అందుకే సెబి ఆ సంస్థ స్కాంపై నివేదిక వెల్లడించాల్సి వచ్చింది. రార్పొరేట్ స్కాంలన్నింటిలో దండలో దారంలో కనిపించేది విదేశాల్లో ఆ సంస్థలు ఏర్పాటు చేసే అనుబంధ షెల్, సూట్‌కేస్ కంపెనీలు, వాటి ద్వారా ఈ దేశంలో అక్రమాలు. ఆర్‌ఇఎల్ కూడా అదే చేసింది. సిట్జర్లాండ్ నుంచి కథ నడిపించింది. ప్రపంచంలోనే అతిపెద్ద గోల్డ్ రిఫయినరీ 'వాల్కంబీ'ని 2015లో కొనుగోలు చేసింది. సంస్థ ఆదాయాన్ని రూ.వందల కోట్లను వేలు లక్షల కోట్లుగా తప్పుడు పద్ధతుల్లో చూపించింది. సంస్థ సి.ఎం.డి. రాజేష్ మెహతా తన వ్యక్తిగత ఖాతాలకు సంస్థ నిధులను భారీగా నిబంధనలకు విరుద్ధంగా మళ్లించారు. సంస్థలో కీలక స్థానాల్లో ఉన్న మరి కొంత మంది సైతం ఇదే పని చేశారు. ఈ కఠోర విషయాలను సెబినే వెల్లడించింది. కంపెనీ కార్పొరేట్ గవర్నెన్స్ లోపభూయిష్టంగా ఉందని ఇప్పుడు గుర్తించడం ప్రభుత్వ వ్యవస్థల పనితీరులో డొల్లతనానికి నిదర్శనం. ఇలాంటివి ఇంకా ఎన్ని జరుగుతున్నాయో తెలియదు. బయటపడితే తప్ప తెలుసుకోలేం. ప్రజలు అనేక విధాలుగా ఇప్పుడు మోసపోతున్నారు. ఈ క్రమంలో పకడ్బందీ చర్యలతో ఆర్థిక మోసాలకు కళ్లెం వేయాలి. కేవలం సైబర్ మోసాలే కాకుండా ఇలాంటి బడా మోసాలపైనా దృష్టి సారించాలి.

--------

## సహారా ఎడారిలో మృత్యు ఘోష

### నీళ్లు లేక 49మంది మృత్యువాత

**సహారా,జూన్ 6 (ప్రజావినికిడి):**



పశ్చిమాఫ్రికాలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. సహారా ఎడారిలో తాగేందుకు నీరు దొరక్క దాహంతో 49 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు ఆగిపోవడంతో వీరంతా కొన్ని రోజుల పాటు ఎడారిలో నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. నైజర్ దేశంలో ఈ దిగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నైజర్‌కు చెందిన కొంతమంది తమ బంధువులతో పండుగ చేసుకునేకుందుకు పక్కనే ఉన్న మాలి దేశానికి ట్రక్కులో బయల్దేరారు. ఆ వేడుక ముగించుకొని తిరిగివస్తుండగా.. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు అసమాకా అనే సరిహద్దు ప్రాంతానికి 80 కిలోమీటర్ల దూరంలో ఆగిపోయింది. అయితే, ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటంతో సాయం చేసేవారు దొరకలేదు. డ్రైవర్‌తో పాటు అందులోని ప్రయాణికులు ట్రక్కును మరమ్మతు చేసేందుకు ప్రయత్నించినా ఫలించలేదు. దీంతో వారంతా కొన్ని రోజుల పాటు ఎడారిలోనే ఉండాల్సి వచ్చింది. అప్పటికే వారి వద్ద ఉన్న నీటి నిల్వలు నిండుకున్నాయి. ఎడారిలో నీటి జాడ లేకపోవడంతో వారు దాహంతో అల్లాడిపోయారు.చివరకు ఇద్దరు వ్యక్తులు దాదాపు 50 కిలోమీటర్లకు పైగా కాలినడకన వెళ్లి నీరు తాగి అక్కడినుంచి అసమాకా పట్టణానికి చేరుకున్నారు. అక్కడ అధికారులను కలిసి విషయం చెప్పారు. అప్రమత్తమైన అధికారులు ఘటనా స్థలానికి చేరుకోగా.. హృదయ విదారక దృశ్యాలు కన్పించాయి. ట్రక్కు చుట్టూ డజన్ల కొద్దీ మృతదేహాలు కన్పించాయని అధికారులు తెలిపారు. విపరీతమైన వేడి, ఉక్కపోత, నీరు లేక 49 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. అయితే, ట్రక్కు ఆగిపోవడానికి కారణమేంటీ, వీరు ఎడారిలో ఎన్ని రోజులు చిక్కుకుపోయారన్న దానిపై స్పష్టత లేదు. సాధారణంగా ఈ ఎడారి జోన్ మీదుగా పౌరులు రాకపోకలు సాగించడం చాలా అరుదని స్థానిక అధికారులు వెల్లడించారు. ఎక్కువ ఆఫ్రికా దేశాల నుంచి యూరప్‌కు వలసవెళ్లేవారు ఈ మార్గాన్ని ఆశ్రయిస్తారని తెలిపారు. గతంలోనూ అనేక మంది ఇసుక వేడి, దాహం, ఆకలితో ఈ మార్గంలో ప్రాణాలు విడిచినట్లు గుర్తుచేసుకున్నారు.

## దేశ ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిన బిజెపి

### కొద్దిమంది కార్పొరేట్ సంస్థల చేతుల్లో దేశ సంపద

### దిగజారుతున్న పేద, మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాలు

### కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా 9న సిపిఎం దేశవ్యాప్త నిరసనలు

**రాజమహేంద్రవరం,జూన్ 6(ప్రజావినికిడి):**
దేశ ప్రజలపై పెరుగుతున్న ఆర్థిక భారాలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల, విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసిన పేపర్ లీకేజీలు, ప్రజా రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మిక హక్కులపై దాడులకు వ్యతిరేకంగా జూన్ 9న దేశవ్యాప్తంగా నిర్వహించే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సిపిఎం తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన ఓ సమావేశం శనివారం సిపిఎం కార్యాలయంలో జువ్వల రాంబాబు అధ్యక్షతన జరిగింది.ముఖ్య అతిధి గా పాల్గొన్న వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్ల పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థను తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేసిందన్నారు. సంపద కొద్దిమంది కార్పొరేట్ సంస్థల చేతుల్లో కేంద్రీకృతమవుతుండగా, పేదలు మరియు మధ్యతరగతి ప్రజల జీవన పరిస్థితులు రోజురోజుకు దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.



దేశంలో నిరుద్యోగం గతంలో ఎన్నడూ లేని స్థాయికి చేరుకుందని, కోట్లాది మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో బలహీనపరుస్తోందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను విపరీతంగా పెంచడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగి ప్రజల జీవనం భారంగా మారిందన్నారు. రైతులకు పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని, వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని పేర్కొన్నారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని, వివిధ ప్రవేశ, ఉద్యోగ పరీక్షల్లో వరుసగా జరుగుతున్న పేపర్ లీకేజీలు పరీక్షా వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీశాయని అన్నారు. లక్షలాది మంది విద్యార్థులు సంవత్సరాలపాటు శ్రమించి పరీక్షలకు సిద్ధమవుతుంటే, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వారి భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్లు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని, ఎనిమిది గంటల పని విధానాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. కార్మికులు సాధించుకున్న హక్కులను కాపాడుకోవడానికి విస్తృత ఐక్య పోరాటాలు అవసరమని అన్నారు.ప్రజల జీవన సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజలను విభజించే రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ప్రజల అసలు సమస్యలైన ఉపాధి, విద్య, వైద్యం, ధరల నియంత్రణ వంటి అంశాలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి టి అరుణ్ మాట్లాడుతూ ధరల పెరుగుదల, నిరుద్యోగం, పేపర్ లీకేజీలు, కార్మిక వ్యతిరేక విధానాలు, ప్రజా రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జూన్ 9న నిర్వహించే నిరసన కార్యక్రమాలలో ప్రజలు, యువత, విద్యార్థులు, కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆంధ్రా పేపర్ లిమిటెడ్ కడియం యూనిట్ లో యాజమాన్యం నిరంకుశ వైఖరి కారణంగా 1200 మంది పర్మినెంట్ కాంట్రాక్టు కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని సమస్య పరిష్కారం చేయాలని కోరారు. సమావేశం లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి పవన్, పి తులసి, జిల్లా కమిటీ సభ్యులు సుందర బాబు, పూర్ణిమ రాజ్, ఎస్ ఎస్ మూర్తి, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఎస్ఆర్టీసీ బస్సులో మంటలు... కిటికీల నుంచి దూకేసిన ప్రయాణికులు

### ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి వద్ద తృటిలో తప్పిన భారీ ప్రమాదం

### జగ్గయ్యపేట నుంచి విజయవాడ వెళుతున్న బస్సులో మంటలు

### వెంటనే రోడ్డు పక్కన బస్సును ఆపేది అందరూ దిగిపోవాలంటూ కేకలు వేసిన డ్రైవర్

### ప్రయాణికులందరూ కిటికీల నుంచి క్షణాల్లో దిగిపోయిన వైనం

**విజయవాడ జూన్ 6(ప్రజావినికిడి):**




ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి వద్ద ఈరోజు ఒక భారీ బస్సు ప్రమాదం తృటిలో తప్పింది. జగ్గయ్యపేట నుంచి విజయవాడ వైపు వెళుతున్న ఏపీఎస్ఆర్టీసీ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో ఒక పెద్ద ప్రాణనష్టం తప్పి, అందరూ సురక్షితంగా బయటపడ్డారు.బస్సు గొల్లపూడి ప్రాంతానికి చేరుకోగానే, ఇంజన్ నుంచి ఒక్కసారిగా మంటలు, దట్టమైన పొగలు రావడాన్ని డ్రైవర్ గమనించాడు. వెంటనే అలర్ట్ అయిన ఆయన బస్సును రోడ్డు పక్కన ఆపి ప్రయాణికులను కిందకు దిగిపోవాల్సిందిగా గట్టిగా కేకలు వేశాడు. బస్సు తలుపు వైపు మంటలు వ్యాపించే ప్రమాదం ఉండటంతో... తీవ్ర ఆందోళనలో ఉన్న ప్రయాణికులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా బస్సు కిటికీల గుండా బయటకు దూకేశారు. ఒకరికొకరు సాయం చేసుకుంటూ అందరూ క్షణాల వ్యవధిలో బస్సు నుంచి సురక్షితంగా బయటపడ్డారు.సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకుని బస్సులో చెలరేగిన మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అటు అధికారులు, ఇటు ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.ఈ ప్రమాద ఘటనపై ఆర్టీసీ, పోలీస్ అధికారులు స్పందిస్తూ... కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. బస్సులో మంటలు చెలరేగడానికి గల కచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని, ఏదైనా మెకానికల్ ఫెయిల్యూర్ లేదా షార్ట్ సర్క్యూట్ లాంటి సాంకేతిక సమస్యల వల్ల ఈ ప్రమాదం జరిగిందా అనే కోణంలో వాహనాన్ని పరిశీలిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

## పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

### ఇరాన్ డ్రోన్లను కూల్చిన అమెరికా సైన్యం -హోర్ముజ్ జలసంధి వద్ద మళ్లీ ఉద్రిక్తతలు

**టెహ్రాన,జూన్ 6 (ప్రజావినికిడి):**
పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మళ్లీ ముసురుతున్నాయి. హోర్ముజ్ జలసంధి లక్ష్యంగా ఇరాన్ ప్రయోగించిన నాలుగు డ్రోన్లను అమెరికా సైన్యం కూల్చివేసింది. దీనికి ప్రతీకారంగా, ఇరాన్ తీరప్రాంతంలోని నిఘా రాడార్ కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులకు దిగింది. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణను తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది.
హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు ఇరాన్ డ్రోన్ల వల్ల తక్షణ ముప్పు పొంచి ఉందని అమెరికా సెంట్రల్ కమాండ్ స్పష్టం చేసింది. ఆత్మరక్షణ చర్యల్లో భాగంగానే జలసంధిలోని ఒక ద్వీపంతో పాటు ఇరాన్ తీరంలోని కీలక రాడార్ సైట్‌లపై తాము దాడులు చేసినట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. మరోవైపు, ప్రపంచ ఇంధన సరఫరాకు గుండెకాయ లాంటి హోర్ముజ్ జలసంధిపై పట్టు సాధించేందుకు ఇరాన్ ప్రయత్నిస్తుండగా, అందుకు ప్రతిగా అమెరికా ఇరాన్ రేవులపై ఆంక్షలు, దిగ్బంధనాన్ని విధిస్తోంది. ఈ వారంలోనే కువైట్



ప్రధాన విమానాశ్రయంలోని ప్యాసింజర్ టెర్మినల్‌పై ఇరాన్ డ్రోన్లు దాడి చేశాయి. ఈ ఘటనలో ఒకరు మరణించగా, డజన్ల కొద్దీ ప్రయాణికులు గాయపడ్డారు. దీనివల్ల ఎయిర్‌ఫీల్డ్ తాత్కాలికంగా మూతపడింది. ఈ దాడితో తీవ్ర ఆగ్రహానికి గురైన అమెరికా, తాజా ఘర్షణతో ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు పంపింది. రాడార్ సైట్‌లపై దాడులతో పాటు, హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తున్న ఇరాన్ లింక్డ్ చమురు ట్యాంకర్‌ను అమెరికా సైన్యం తమ ఆధీనంలోకి తీసుకుంది. ఆంక్షల పరిధిలో ఉన్న చమురును విక్రయించడం ద్వారా ఇరాన్ లాభపడకుండా అడ్డుకునేందుకు అమెరికా ఈ చర్య చేపట్టింది. అలాగే, ఇరాన్ ఇంధన రంగానికి సహాయం చేస్తున్న పలువురు వ్యక్తులు, సంస్థలు, ట్యాంకర్లపై అమెరికా కొత్తగా మరికొన్ని ఆర్థిక ఆంక్షలను విధించింది. ఇరాన్-అమెరికా ఘర్షణ కేవలం జలసంధికే పరిమితం కాలేదు. అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, లెబనాన్ ప్రభుత్వాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ మద్దతున్న హెజ్‌బొల్లా ఉగ్రవాద సంస్థ తిరస్కరించింది. ఈ క్రమంలో శుక్రవారం ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ లెబనాన్‌లోని ఎక్కువ భాగాన్ని ఇజ్రాయెల్ ఇప్పటికే తన ఆధీనంలోకి తెచ్చుకుంది. మరోవైపు, హోర్ముజ్ జలసంధి తెరవాలన్నా, శాశ్వత కాల్పుల విరమణ కుదరాలన్నా లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు ఆగాలని ఇరాన్ పట్టుబడుతోంది.

# రాహుల్, గిల్ సెంచరీల మోత..

## భారీ స్కోరు దిశగా భారత్..!

## అఫ్ఘాన్‌తో భారత్ ఏకైక టెస్టు




అఫ్ఘానిస్థాన్‌తో శనివారం ప్రారంభమైన ఏకైక టెస్టు తొలి రోజు ఆటలో టీమిండియా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. ముల్లాన్‌పూర్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్.. తొలి రోజు ముగిసేసరికి 3 వికెట్ల నష్టానికి 368 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ శతకాలతో కదం తొక్కగా, యువ బ్యాటర్ సాయి సుదర్శన్ (81), రిషభ్ పంత్ (50 నాటౌట్) అర్ధసెంచరీలతో రాణించారు. అఫ్ఘాన్ బౌలర్లలో సలీమ్ సఫీ రెండు వికెట్లు పడగొట్టాడు. అఫ్ఘానిస్థాన్‌తో శనివారం ప్రారంభమైన ఏకైక టెస్టు మ్యాచ్ తొలి రోజు ఆటలో టీమిండియా ఆధిక్యం కనబరిచింది. న్యూచండీగఢ్‌లోని ముల్లాన్‌పూర్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నాడు. యశస్వి జైశ్వాల్‌తో పాటు కేఎల్ రాహుల్ ఇన్నింగ్స్ ప్రారంభించాడు. అయితే 32 బంతుల్లో 24 రన్స్ చేసిన తర్వాత జైశ్వాల్.. తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన సాయి సుదర్శన్.. రాహుల్‌తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు .ఆడేది టెస్టు మ్యాచ్ అయినా.. సాయి సుదర్శన్ మాత్రం వేగంగా పరుగులు రాబట్టాడు. హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుని.. సెంచరీ దిశగా అడుగులు వేశాడు. మరోవైపు కేఎల్ రాహుల్ కూడా ఈజీగా పరుగులు రాబట్టాడు. దీంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. ఈ క్రమంలోనే కేఏల్ రాహుల్ శతకం పూర్తి చేసుకున్నాడు.

అయితే అదే స్కోరు వద్ద అతడు క్యాచ్ ఔట్ అయ్యాడు. సాయి సుదర్శన్ 104 బంతుల్లో 81 రన్స్ చేసి పెవిలియన్ చేరిపోయాడు. రాహుల్, సుదర్శన్.. రెండో వికెట్‌కు 139 పరుగులు జోడిం చారు. ఆ తర్వాత స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లే బాధ్యతను కెప్టెన్ శుభ్‌మన్ గిల్ , రిషభ్ పంత్ తీసుకున్నారు. ఈ క్రమంలోనే శుభ్‌మన్ గిల్.. తన టెస్ట్ కెరీర్‌లో మరో శతకాన్ని పూర్తి చేశాడు. మరోవైపు రిషభ్ పంత్ కూడా ధాటిగా బ్యాటింగ్ చేసి.. అర్ధశ తకాన్ని పూర్తి చేసుకున్నాడు. దీంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్.. 85 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 368 పరుగులతో నిలిచింది. ప్రస్తుతం క్రీజులో శు భ్‌మన్ గిల్ (143 బంతుల్లో 103 రన్స్), రిషభ్ పంత్ (70 బంతుల్లో 50 రన్స్) ఉన్నారు. అఫ్ఘా నిస్థాన్ బౌలర్లలో మహమ్మద్ సలీమ్ సఫీ రెండు వికెట్లు తీశాడు. రెహ్మాన్ షరీఫ్ ఒక వికెట్ పడగొట్టారు. టీమి ండియా రెండో రోజు ఆటలో 500 రన్స్ మార్కు ను చేరుకుని.. ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసే అవకాశం ఉంది.



# సచిన్ రికార్డు బ్రేక్ చేసిన వైభవ్

ఐపీఎల్ 2026లో రికార్డుల మోత మోగించిన 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి జాతీయ జట్టు నుంచి తొలిసారి పిలుపు వచ్చింది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ టీ20 సిరీస్‌ల కోసం ప్రకటించిన భారత జట్టులో అతడికి చోటు దక్కింది. 15 ఏళ్ల 70 రోజుల వయసులోనే ఎంపికై సచిన్ టెండూల్కర్ రికార్డును వైభవ్ బ్రేక్ చేశాడు. ఐపీఎల్‌లో 776 పరుగులు, 72 సిక్సర్లతో ఆరెంజ్ క్యాప్, మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ అవార్డులను గెలుచుకుని, సెలక్టర్లు కచ్చితంగా ఎంపిక చేయాల్సిన పరిస్థితిని అతడు కల్పించాడు.15 ఏళ్ల వయసులోనే ఐపీఎల్‌లో రికార్డుల బూజు దులిపిన వైభవ్ సూర్యవంశీకి జాతీయ జట్టు నుంచి పిలుపు అందింది. ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో త్వరలో జరగనున్న టీ20 సిరీస్ కోసం భారత సెలక్షన్ కమిటీ శనివారం జట్లను ప్రకటించింది. ఇందులో వైభవ్ సూర్యవంశీకి చోటు దక్కింది. తన ప్రదర్శనతో జట్టులో ఎంపిక చేయక తప్పని పరిస్థితిని వైభవ్ కలిగించాడని చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ వెల్లడించాడు. అయితే భారత జట్టు నుంచి తొలిసారి పిలుపు అందుకోవడం ద్వారా.. వైభవ్ సూర్యవంశీ రికార్డు క్రియేట్ చేశాడు.15 ఏళ్ల 70 రోజుల వయసులో వైభవ్‌కు టీమిండియా నుంచి పిలుపు అందింది. గతంలో ఈ రికార్డు టీమిండియా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉంది. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్.. భారత్ తరఫున 16 ఏళ్ల 205 రోజులు ఉన్నప్పుడు ఎంపికయ్యాడు. తాజాగా ఆ రికార్డును వైభవ్ సూర్యవంశీ బ్రేక్ చేశాడు. ప్రపంచ దృష్టిని తనవైపు ఆకర్షించాడు. కాగా ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026లో వైభవ్ సూర్యవంశీ పలు భారీ రికార్డులు బ్రేక్ చేశాడు.

# రజత్ పాటిదార్‌కు మరోసారి మొండిచేయి



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) కెప్టెన్ రజత్ పాటిదార్‌కు మరోసారి మొండి చెయ్యే ఎదురైంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో అద్వితీయమైన బ్యాటింగ్ ప్రదర్శనతో పాటు సూపర్ కెప్టెన్సీతో ఆర్‌సీబీని విజేతగా నిలబెట్టినా.. వరుసగా రెండో టైటిల్ అందించినా రజత్ పాటిదార్‌ను బీసీసీఐ సెలెక్టర్లు పట్టించుకోలేదు. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనతో పాటు ఆసియా గేమ్స్ కోసం ఎంపిక చేసిన భారత జట్టులోకి రజత్ పాటిదార్‌ను తీసుకోలేదు. శనివారం నయా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత టీ20 జట్టును అజిత్ అగార్కర్ నేతృత్వంలోని భారత సెలెక్షన్ కమిటీ ప్రకటించిన సంగతి తెలిసిందే. పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న సూర్యకుమార్ యాదవ్‌పై వేటు వేసిన సెలెక్షన్ కమిటీ అతని స్థానంలో శ్రేయస్ అయ్యర్‌ను కొత్త సారథిగా ఎంపిక చేసింది. వైస్ కెప్టెన్‌గా తెలుగు తేజం తిలక్ వర్మను నియమించింది. ఐపీఎల్‌లో విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగిన టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీకి కూడా అవకాశం కల్పించింది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో మొత్తం ఐదుగురు ఆటగాళ్లు ఉద్వాసనకు గురయ్యారు. నితీష్ కుమార్ రెడ్డి, రవి బిష్ణోయ్, ప్రిన్స్ యాదవ్‌లకు అవకాశం కల్పించారు.

# భవిష్యత్తు ప్రణాళికల్లో భాగంగానే శ్రేయస్‌కు బాధ్యతలు

**- చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ వివరణ**



భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను జట్టు నుంచి పూర్తిగా తొలగించడంపై బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ శనివారం కీలక వివరణ ఇచ్చారు. మూడు నెలల క్రితమే దేశానికి టీ20 ప్రపంచకప్ అందించి, ఎంఎస్ ధోని, రోహిత్ శర్మల సరసన నిలిచిన కెప్టెన్‌ను పక్కన పెట్టడం సులువైన నిర్ణయం కాదని ఆయన అంగీకరించారు. అయితే ఒక మెగా టోర్నీ ముగిసిన తర్వాత భవిష్యత్తు ప్రణాళికలను పునఃసమీక్షించుకోవడం సహజమని పేర్కొన్నారు. సూర్యకుమార్ వ్యక్తిగత ఫామ్ క్షీణించడం, అదే సమయంలో రాబోయే రెండేళ్ల ప్రపంచకప్ సైకిల్‌ను దృష్టిలో ఉంచుకుని జట్టు మేనేజ్‌మెంట్ ఈ కఠిన నిర్ణయం తీసుకుందని అగార్కర్ స్పష్టం చేశారు. జట్టు ప్రయోజనాల దృష్ట్యా శ్రేయస్ అయ్యర్‌ను కొత్త కెప్టెన్‌గా నియమించడమే సరైన మార్గమని సెలెక్షన్ కమిటీ భావించింది.ఐపీఎల్ టోర్నీలలో వేర్వేరు జట్లను విజయవంతంగా నడిపించిన అపారమైన నాయకత్వ అనుభవం శ్రేయస్ అయ్యర్‌కు ఉందని అగార్కర్ కొనియాడారు. 2024లో కోల్‌కతా నైట్ రైడర్స్‌ను విజేతగా నిలిపిన అయ్యర్, ఆ తర్వాతి సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌ను రన్నరప్‌గా నిలబెట్టారు. ప్రస్తుత 2026 ఐపీఎల్ సీజన్ ప్రారంభంలో పంజాబ్ జట్టును వరుసగా ఏడు మ్యాచ్‌ల్లో అజేయంగా నడిపించి, కేవలం ఒక్క పాయింట్ తేడాతో ప్లేఆఫ్స్ అవకాశాన్ని కోల్పోయారు. కెప్టెన్‌గా ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో ఆయన నిరూపించుకున్నారు. నాయకత్వ బాధ్యతలతో పాటు బ్యాటర్‌గా కూడా అయ్యర్ స్థిరమైన ప్రదర్శన చేయడం సెలెక్టర్లను ఎంతగానో ఆకట్టుకుంది. గత ప్రపంచకప్ జట్టు ఎంపిక సమయంలోనే శ్రేయస్ అయ్యర్ రేసులో నిలిచారని, అయితే అప్పట్లో సూర్యకుమార్ జట్టులో ఉండటం వల్ల ఆయనకు చోటు దక్కలేదని అగార్కర్ వెల్లడించారు. టీ20 ఫార్మాట్‌లో కెప్టెన్‌గా ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్న అయ్యర్, ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో భారత జట్టును నడిపించడానికి పూర్తి అర్హుడని కమిటీ నమ్మింది. ప్రపంచకప్ ముగిసిన వెంటనే జట్టును సరికొత్తగా పునర్వ్యవస్థీకరించడంలో భాగంగానే ఈ మార్పులు జరిగాయి. రాబోయే ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలలో శ్రేయస్ అయ్యర్ సరికొత్త వ్యూహాలతో భారత జట్టును ముందుకు నడిపించనున్నారు.

# నార్వే చెస్ చాంపియన్‌గా ప్రజ్ఞానంద..



భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద అంతర్జాతీయ చదరంగ వేదికపై సరికొత్త చరిత్ర సృష్టించారు. ప్రతిష్టాత్మక నార్వే చెస్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన తొలి భారతీయ ఆటగాడిగా ఆయన రికార్డు సృష్టించారు. ఈ అద్భుత విజయంపై స్పందించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియా వేదికగా ప్రజ్ఞానందకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రజ్ఞానంద సాధించిన ఈ ఘనత భారత చెస్ రంగానికి ఒక గొప్ప మైలురాయి అని, అంతర్జాతీయ స్థాయిలో ఆయన చూపిస్తున్న ప్రతిభ అద్భుతమని ప్రధాని కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. నార్వే రాజధాని ఓస్లోలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో సాధించిన విజయం ప్రజ్ఞానంద కెరీర్‌లోనే అత్యుత్తమమైనదిగా నిలిచిపోతుంది. ఈ టోర్నమెంట్‌లో ఒక దశలో వెనుకబడిన చెన్నై యువ సంచలనం ప్రజ్ఞానంద, ద్వితీయార్థంలో అద్భుతంగా పుంజుకుని ప్రపంచ అత్యుత్తమ ఆటగాళ్లను ఓడించారు. చివరి రౌండ్‌కు ముందు అమెరికా గ్రాండ్‌మాస్టర్ వెస్లీ సో స్వల్ప పాయింట్ల ఆధిక్యంతో టైటిల్ రేసులో ముందున్నారు. అయితే చివరి క్లాసికల్ గేమ్‌లో వెస్లీ సో డ్రా చేసుకోవడంతో ప్రజ్ఞానందకు సువర్ణావకాశం లభించింది. ఆఖరి పోరులో జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్‌ను తెల్ల ముక్కలతో ఎదుర్కొన్న ప్రజ్ఞానంద, ఒత్తిడిని అధిగమించి అద్భుతమైన ఆటతీరుతో విజయం సాధించారు. వరుసగా నాలుగో క్లాసికల్ విజయాన్ని నమోదు చేయడం ద్వారా పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుని నార్వే చెస్ చాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఈ టోర్నమెంట్‌లో ప్రపంచ నంబర్ వన్ మాగ్నస్ కార్ల్‌సన్, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ డి గుకేష్, వెస్లీ సో, అలీరెజా ఫిరౌజ్జా వంటి దిగ్గజాలు బరిలో నిలిచారు. ఇంతటి కఠినమైన పోటీలో ప్రజ్ఞానంద కేవలం ఒకే వారంలో కార్ల్‌సన్, గుకేష్, ఫిరౌజ్జా, కీమర్లను క్లాసికల్ గేమ్‌లలో ఓడించడం విశేషం. ముఖ్యంగా హోమ్ గ్రౌండ్‌లో ఆడుతున్న ప్రపంచ నంబర్ వన్ మాగ్నస్ కార్ల్‌సన్‌ను ఒకే టోర్నమెంట్‌లో రెండుసార్లు క్లాసికల్ చెస్‌లో ఓడించిన రెండో భారతీయ ఆటగాడిగా (విశ్వనాథన్ ఆనంద్ తర్వాత) ప్రజ్ఞానంద అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నారు. ఈ అద్భుత ప్రదర్శన ద్వారా లైవ్ రేటింగ్స్‌లో ఆయన ప్రపంచవ్యాప్తంగా 11వ స్థానానికి ఎగబాకారు.

# అత్యంత నైపుణ్యం కలిగిన జట్టుకు శుభాకాంక్షలు

**• కెప్టెన్సీ కోల్పోయిన తర్వాత సూర్య వ్యాఖ్యలు**

భారత్‌కు టీ20 వరల్డ్‌కప్ అందించిన మూడు నెలలకే సూర్యకుమార్ యాదవ్‌పై సెలక్షన్ కమిటీ వేటు వేసింది. అతడిని టీ20 జట్టు కెప్టెన్సీ నుంచి తొలగించి ఆ బాధ్యతలను శ్రేయస్ అయ్యర్‌కు అప్పగించింది. అంతేకాకుండా టీమ్‌ఇండియా అప్‌కమింగ్ సిరీస్‌లకు అతడిని సభ్యుడిగా కూడా ఎంపిక చేయలేదు. రానున్న మూడు నెలల్లో భారత్ ఆడనున్న ఐర్లాండ్, ఇంగ్లాండ్ టీ20 సిరీస్‌లతోపాటు, ఆసియా గేమ్స్‌కు జట్లను సెలక్షన్ కమిటీ శనివారం ప్రకటించింది. అయితే జట్టు ప్రకటన తర్వాత సూర్య తన సోషల్ మీడియాలో ఓ పోస్టు షేర్ చేశాడు. అది వైరల్‌గా మారింది.ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలతోపాటు జపాన్ వేదికగా సెప్టెంబర్‌లో జరగనున్న ఆసియా గేమ్స్ జట్టులోనూ సూర్యకు స్థానం దక్కలేదు. కొంతకాలంగా బ్యాటర్‌గా సూర్య పెద్దగా ఫామ్‌లో లేకపోవడంతో ఈ మూడు కీలక సిరీస్‌లకు సూర్యను సెలక్టర్లు ఎంపిక చేయలేదు. జట్టులో స్థానం కోల్పోయిన బాధలోనూ, సూర్య తన మంచి మనసు చాటుకున్నాడు. ఈ సిరీస్‌ల్లో ఆడనున్న టీమ్‌ఇండియాకు సూర్య శుభాకాంక్షలు తెలిపాడు. 'అత్యంత నైపుణ్యం కలిగిన జట్టుకు శుభాకాంక్షలు. ముందున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు మీకు ఆల్ ది బెస్ట్' అని పేర్కొన్నాడుఅలాగే మూడు సిరీస్‌లకు కూడా 15ఏళ్ల వైభవ్ సూర్యవంశీని సెలక్టర్లు ఎంపిక చేశారు. దీంతో అతడు తొలిసారి సీనియర్ టీమ్‌ఇండియా జట్టులో ఆడనున్నాడు. అతడి ఎంపికపై సూర్య హర్షం వ్యక్తం చేశాడు. 'దీనికి నువ్వు పూర్తిగా అర్హుడవు. టీమ్‌ఇండియాతో నీ జర్నీని చూసేందుకు ఆసక్తిగా ఉన్నా' అని ఇన్‌స్టా స్టోరీలో రాసుకొచ్చాడు. కొంతకాలంగా సూర్య ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్నాడు. అయితే ఈ ఏడాది న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో కమ్‌బ్యాక్ ఇచ్చినట్లు కనిపించాడు. 5 మ్యాచ్‌ల్లో 80.67 యావరేజ్‌తో 242 పరుగులు చేశాడు. స్ట్రైక్ రేట్ కూడా 190o ఉండడం విశేషం. ఈ సిరీస్‌లో సూర్యనే టాప్ స్కోరర్. అయితే తర్వాత జరిగిన వరల్డ్‌కప్‌లో ఆకట్టులోలేదు. 9 మ్యాచ్‌ల్లో సూర్య 242 పరుగులు చేశాడు. ఇక రీసెంట్‌గా




ముగిసిన ఐపీఎల్ మాత్రం ఘోరంగా విఫలమయ్యాడు. 13 మ్యాచ్‌ల్లో 270 రన్స్ మాత్రమే చేశాడు. ఇందులో ఒకే ఒక్క హాఫ్ సెంచరీ ఉంది. అలాగే ప్రస్తుతం సూర్య వయసు 35ఏళ్లు. వచ్చే టీ20 వరల్డ్‌కప్, 2028 ఒలింపిక్స్ దాకా అతడికి 37 ఏళ్లు ఉంటాయి.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

# పెద్దికి ఊహించని విజయం

## దర్శక,నిర్మాతల ఆనందం




'మేం నమ్మిన విషయాన్ని ప్రేక్షకులు నిజం చేశారు. స్ఫూర్తిదాయకమైన 'పెద్ది' సినిమాని తమ పిల్లలతో కలిసి కుటుంబాలు ఆస్వాదిస్తున్నాయి. రానున్న పది రోజుల్లో 'పెద్ది' మరింత పెద్ద విజయంగా నిలుస్తుంది' అన్నారు బుచ్చిబాబు సానా. ఆయన దర్శకత్వంలో... రామ్‌చరణ్ కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రం 'పెద్ది'. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మించారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సమర్పించాయి. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా బాక్సాఫీస్ ఛాంపియన్ పేరుతో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించింది చిత్రబృందం. దర్శకుడు మాట్లాడుతూ 'చాలా పెద్ద విజయం ఇది. ముందస్తు ప్రదర్శనల నుంచే నా ఫోన్ ఆగకుండా మోగుతోంది. నా తొలి చిత్రం 'ఉప్పెన' కంటే పది రెట్లు మించిన స్పందన వచ్చింది. సినిమా చూసినవాళ్లంతా ఎంతో స్ఫూర్తి పొందామని చెబుతున్నారు. రామ్‌చరణ్ పడిన కష్టాన్ని అందరూ గుర్తించారు. ఆయన లేకపోతే ఈ సినిమా లేదు' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల ఆదరణతో అద్భుతంగా దూసుకుపోతోంది 'పెద్ది' చిత్రం. తొలి రోజే రూ.135 కోట్లకుపైగా వసూళ్లు సాధించింది. రామ్‌చరణ్ కెరీర్‌లోనే అత్యుత్తమైన సినిమాగా నిలుస్తూ, రికార్డ్ స్థాయిలో వసూళ్లు సాధిస్తోంది. నిర్మాత రవిశంకర్ యలమంచిలి మాట్లాడుతూ 'తెలుగులో ఇప్పటివరకూ చూడని ఓ కొత్త రకమైన క్రీడా నేపథ్యంలోని సినిమా ఇది. పిల్లలకు ఎంతగానో ఉపయోగపడే చిత్రం. అందుకే ఇంటిల్లిపాదీ వెళ్లి చూడాలని కోరుతున్నాం. దర్శకుడు బుచ్చిబాబు రాసిన కథ, అద్భుతమైన రామ్‌చరణ్ నటన కారణంగా ఈ సినిమా రికార్డు స్థాయిలో వసూళ్లు సాధిస్తోంది' అన్నారు.



# కాక్‌టెయిల్-2 లో నటించడానికి భయపడ్డా: రష్మిక

కొద్ది రోజుల్లో 'కాక్‌టెయిల్ 2'తో ప్రేక్షకుల్ని అలరించడానికి ముస్తాబవుతోంది అందాల తార రష్మిక. ఆమె, షాహిద్ కపూర్, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రమిది. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇందులో దియా పాత్రలో కనిపించనుంది రష్మిక. ఈ నేపథ్యంలోనే ఓ కార్యక్రమంలో పాల్గొన్న రష్మిక.. ఈ సినిమా గురించి మాట్లాడుతూ.. 'ఈ ప్రాజెక్టులో నటించడం గురించి నేను అంత సులభంగా నిర్ణయం తీసుకోలేదు. ముఖ్యంగా ఇందులో నటించడానికి నిజంగా భయపడ్డాను. ఎందుకంటే ఇప్పటి వరకు నేను భాగమైన చిత్రాల్లో ఇంత మోడ్రన్‌గా కనిపించలేదు. అందుకే ప్రారంభంలో ఈ చిత్రంలో నటించడం గురించి నేను తీసుకున్న నిర్ణయం సరైందా? కాదా? అనే సందేహం ఉండేది. కానీ అదే సమయంలో ఇంతకు ముందెప్పుడూ ఇలాంటి పాత్రలో చేయలేదు కాబట్టి.. ఇందులో నటించాను' అని చెప్పింది.

# ఫ్యాన్‌కు కుకీస్ పంపిన జూనియర్ ఎన్టీఆర్!




గ్లోబల్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్ కేవలం వెండితెరపైనే కాదు, వంటింట్లో కూడా తన ప్రతిభను చాటుకుంటున్నాడు. ఆయన వండే బిర్యానీ, నాటు కోడి కూర గురించి ఇప్పటికే ఇండస్ట్రీలో పెద్ద టాక్ ఉంది. అయితే, తాజాగా తారక్ తన కుకింగ్ స్కిల్స్‌ను మరో లెవల్‌కు తీసుకెళ్లి.. మొదటిసారి కుకీస్ బేక్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు.ఎన్టీఆర్ తాను స్వయంగా చేసిన కుకీస్ ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేయగా, అది చూసిన సాయి తేజ అనే అభిమాని సరదాగా ఇలా కామెంట్ చేశాడు. "అన్నా, మా ఇంట్లో ఇద్దరు పిల్లలు ఉన్నారు. మాకు కూడా రెండు కుకీస్ పంపిస్తావా?" అని అడిగాడు. దీనికి తారక్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా, 'కింగ్' సినిమాలోని బ్రహ్మానందం పాపులర్ మీమ్ డైలాగ్‌తో రిప్లై ఇచ్చాడు. "అడ్రస్ పెట్టు.. ఫాస్ట్ గా అడ్రస్ పెట్టు" అని సమాధానమిచ్చాడు. ఎన్టీఆర్ నుండి ఊహించని రిప్లై రావడంతో ఆ అభిమాని షాక్ అయ్యాడు. "అన్నా.. నీ రిప్లై చూసి నా చేతులు, కాళ్లు వణుకుతున్నాయి, కళ్లలో నీళ్లు ఆగడం లేదు. నా జీవితంలో ఇది మర్చిపోలేని క్షణం" అంటూ ఎమోషనల్ అయ్యాడు. అయితే, తారక్ కేవలం రిప్లైతోనే ఆగిపోకుండా, అన్న మాట ప్రకారం ఆ అభిమాని ఇంటికి నిజంగానే కుకీస్ పంపించి తన మనసును చాటుకున్నాడు.ఇక మరో నెటిజన్.. "బిర్యానీ, చికెన్ వండే టైగర్ ఇప్పుడు కుకీస్ కూడా చేస్తున్నారా?" అని జోక్ చేయగా... దానికి కూడా తారక్ అంతే ఫన్నీగా మరో బ్రహ్మానందం మీమ్ డైలాగ్ "మారాయ్.. అన్నీ మారాయ్!" అంటూ రిప్లై ఇచ్చారు. అభిమానులతో ఎన్టీఆర్ చేస్తున్న ఈ సరదా సంభాషణలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి.

# విమర్శలు కూడా సృజనాత్మకతగానే చూడాలి



సినిమా అంటేనే కేవలం కల్పిత కథ అని.. అందులోని తప్పొప్పులు నిర్ణయించుకునే పూర్తి విచక్షణ మనపైనే ఉంటుందని నటి అనసూయ భరద్వాజ్ అన్నారు. సమాజంలో జరిగే విషయాలకు సినిమాలతో ముడిపెట్టొద్దని అన్నారు. చిత్రరంగంపై బాధ్యత, సృజనాత్మక స్వేచ్ఛ గురించి ఆమె సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. 'ఒకప్పటి కథలలో నైతికత కనిపించేది. హీరో పాత్రలు స్ఫూర్తిదాయకంగా ఉండేవి. విలన్ పాత్రలు మనం అనుకరించకూడదు అనిపించేలా ఉండేవి. ఈ రోజుల్లో తెరకెక్కే కథల్లో ఈ స్పష్టత లోపిస్తోంది. పాత్రను గొప్పగా చూపించడం కోసం దర్శకులు ఈ గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. ఒక కథను తెరకెక్కిస్తు న్నామంటే.. దాని ప్రభావం ఎలా ఉంటుందనే దానిలో టెక్నికల్ టీమ్ నుంచి దర్శక నిర్మాతలు, నటీనటులు, చివరకు ప్రేక్షకులు కూడా కీలక పాత్రధారులే. అందుకే సినిమా ఎప్పుడూ బాధ్యతాయుతంగా ఉండాలి. సృజనాత్మకత విషయంలో వచ్చిన భేదాభిప్రాయాల వల్ల నేను కొన్ని షోల నుంచి వైదొలిగిన సందర్భాలూ ఉన్నాయి. దానివల్ల నా ప్రతిభకు తగిన అవకాశాలు రావడంలో ఇబ్బందులూ ఎదుర్కొన్నా. అంత కష్టంలోనూ నా సిద్ధాంతాల కోసమే నిలబడ్డాను అని అనసూయ చెప్పారు. సృజనాత్మక స్వేచ్ఛ అనేది చాలా అవసరం. అదే సమయంలో సామాజిక స్పృహ ఉండటం కూడా అంతే ముఖ్యం. సినిమాలు సమాజాన్ని మంచి మార్గంలో ముందుకు నడిపించాలని ఆశించకూడదు. అలాగని సమాజంపై ఎలాంటి ప్రభావం చూపవని కూడా అనుకోకూడదు. సమాజంలో జరిగే ప్రతి విషయానికి సినిమాను నిందించలేం. సోషల్ మీడియాలో చాలామంది ముందుకువచ్చి ఇలాంటి విషయాలపై చర్చలు పెట్టడం, కథల్లో పాత్రలను చూపించే విధానాలను ప్రశ్నించడం, విమర్శనాత్మకంగా ఆలోచించడాన్ని చూస్తుంటే నాకు నిజంగా సంతోషంగా ఉంది. అవసరమైనప్పుడు తప్పులను ప్రశ్నించడం అంటే సృజనాత్మకతపై దాడి చేయడం కాదు, అది సమాజంలో అవగాహన పెంచడం మాత్రమే' అని అనసూయ వివరించారు.

# 80 కేజీల డెడ్‌లిఫ్ట్ ఎత్తడంతో గాయమైంది...

## ఆ సమయంలో మంచానికే పరిమితమయ్యాను: రకుల్ ప్రీత్ సింగ్



ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్ తాను గతంలో ఎదుర్కొన్న తీవ్రమైన ఆరోగ్య సమస్య గురించి తాజాగా స్పందించారు. జిమ్‌లో శిక్షణ పొందుతున్న సమయంలో 80 కిలోల డెడ్‌లిఫ్ట్‌ను ఎటువంటి సేఫ్టీ బెల్ట్ లేకుండా ప్రయత్నించడం వల్ల స్లిప్ డిస్క్ బారినపడ్డానని, ఆ గాయం కారణంగా సుమారు 40 రోజుల పాటు మంచానికే పరిమితం కావాల్సి వచ్చిందని ఆమె తెలిపారు.

నేహా ధూపియా, అంగద్ బేడీలు నిర్వహిస్తున్న 'డబుల్ డేట్' టాక్ షోలో తన భర్త జాకీ భగ్నానీతో కలిసి పాల్గొన్న రకుల్, ఆనాటి చేదు అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. "మీ ట్రైనర్‌లు ఏం చెప్పినా సరే, డెడ్‌లిఫ్ట్ చేయడం అనేది అత్యంత ప్రమాదకరమైన వ్యాయామం. అది కేవలం ఒక ఇగో లిఫ్ట్ మాత్రమే. ఆనాడు నేను చేసిన చిన్న పొరపాటు స్లిప్ డిస్క్‌కు దారితీసింది" అని ఆమె పేర్కొన్నారు. ఆ గాయం కారణంగా కనీసం కదలలేని స్థితికి చేరుకున్నానని, నరాల సంబంధిత సమస్యలు కూడా తలెత్తాయని ఆమె వివరించారు.ఎంతో చురుకుగా ఉండే తాను, రోజువారీ పనుల కోసం కూడా ఇతరులపై ఆధారపడాల్సి రావడం తనను మానసిక వేదనకు గురిచేసిందని రకుల్ తెలిపారు. "ఇది కేవలం శారీరక గాయమే కాదు, నన్ను మానసికంగానూ ఎంతో కృంగదీసింది" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ఆ క్లిష్ట పరిస్థితుల్లో తన భర్త జాకీ భగ్నానీ తనకు అండగా నిలిచి ఎంతో ధైర్యాన్ని అందించారని ఆమె పేర్కొన్నారు. 2024 ఫిబ్రవరిలో గోవా వేదికగా వివాహం చేసుకున్న ఈ జంట, తమ వైవాహిక బంధానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను ఈ షోలో పంచుకున్నారు.





# జూలై నుంచి కల్కి-2 రెగ్యులర్ షూటింగ్

ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి సీక్వెల్‌గా రాబోతున్న 'కల్కి 2' అప్‌డేట్ గురించి నాగ్ అశ్విన్ క్లారిటీ ఇచ్చారు. సినిమా పనుల గురించి వివరణ చేస్తూ.. కల్కి 2 షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైంది. వచ్చే జూలై నుండి కంటిన్యూగా షూటింగ్ ప్లాన్ చేశాం. చాలా శరవేగంగా షూటింగ్ పూర్తి చేసేలా అన్ని సన్నాహాలు జరుగుతున్నాయని నాగ్ అశ్విన్ వెల్లడించారు. ఈ అప్‌డేట్‌తో ప్రభాస్ అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

# రామ్ సినిమాకు జాతీయ అవార్డు గ్రహీత..

## విజువల్స్‌పై భారీ అంచనాలు



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని దర్శకుడిగా మారి రూపొందిస్తున్న తొలి చిత్రం #RAPO23కి సంబంధించి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ వెలువడింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ తిరునవుక్కరసు (తిరు) భాగమయ్యారు. ఆయన చేరికతో సినిమా సాంకేతిక బృందం మరింత బలోపేతమైంది.తన పుట్టినరోజు సందర్భంగా మే 15న రామ్ ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచిన విషయం తెలిసిందే. ఈ చిత్రానికి ఆయనే కథ, దర్శకత్వం అందిస్తూ, 'వీర' అనే ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. ఇది ఒక సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ అని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. రామ్ సోదరుడు కృష్ణ పోతినేని 'రాపో సినిమాటిక్స్' అనే కొత్త బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ప్రస్తుతం శరవేగంగా ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రానికి తిరు కెమెరామెన్‌గా వ్యవహరించనుండటంతో అంచనాలు పెరిగాయి. '24', 'జనతా గ్యారేజ్', 'భరత్ అనే నేను', 'పేట' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలకు అద్భుతమైన విజువల్స్ అందించిన తిరు, రామ్ తొలి దర్శకత్వ చిత్రానికి ఎలాంటి దృశ్యమాన అనుభూతినిస్తారోనని ఇండస్ట్రీలో ఆసక్తి నెలకొంది.

గతంలో 'ఆంధ్రా కింగ్ తాలుకా' (2025) చిత్రానికి గీత రచయితగా పనిచేసిన రామ్, ఇప్పుడు ఏకంగా రైటర్, డైరెక్టర్, హీరోగా బహుముఖ బాధ్యతలు చేపట్టడం విశేషం. తిరు చేరికతో #RAPO23 విజువల్స్ అత్యున్నత స్థాయిలో ఉంటాయని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. త్వరలోనే ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుండగా, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613